
https://prajapratibha.com
RNI : APTEL 2013/54721
# ప్రజా ప్రతిభ
ప్రతి అక్షరం ప్రజా పక్షం
తెలుగు దినపత్రిక
సంపుటి: 13 | సంచిక: 266 | prajapratibha.2013@gmail.com | ఎడిటర్ : దానూరి శ్రీనివాస్ | 9441500341 | వెల: రూ.5.00 | పేజీలు: 13
ఆంధ్రప్రదేశ్ Published from Andhra pradesh & Telangana గురువారం, జూన్ 4, 2026



అత్యధిక కాలం ప్రధానిగా మోడీ
నెహ్రూ రికార్డుకు మోడీ బ్రేక్
02 లో.





# ఆరోగ్యం ఉంటేనే సంపద

## హెల్తీ సిటిజన్స్‌తోనే వెల్తీ నేషన్ నిర్మాణం

- ఇంటి దగ్గరకే అత్యుత్తమ వైద్య సేవలు అందించేలా 'సంజీవని'
- కార్పొరేట్ ఆస్పత్రుల్లో యోగా శిక్షణకు ప్రత్యేక సెల్
- యూరియా వాడకం తగ్గితే మెరుగ్గా ప్రజారోగ్యం
- లలితా పీవీఎస్ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**గుంటూరు, జూన్3(ప్రజా ప్రతిభ):** హెల్తీ సిటిజన్సే.. వెల్తీ నేషన్ నిర్మించగలరని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అందుకే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధనలో ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చామని సీఎం తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుంటూరు జిల్లాలో పర్యటించారు. లలితా పీవీఎస్ హాస్పటల్‌ను ప్రారంభించి, పరిశీలించారు. 600 పడకలతో అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించిన లలితా ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు. మొత్తంగా 32 విభాగాలకు సంబంధించి ఒకేచోట వైద్య సేవలు అందించేలా ఆస్పత్రిని నిర్మించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. లలిత ఆస్పత్రి ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన సేవలు అందాలని సీఎం ఆకాంక్షించారు. ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ సహా పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. 'ఆరోగ్యానికి మించిన ఆస్తి ఉండదు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నవారే నిజమైన ధనవంతులు. వేల కోట్ల రూపాయలున్నా, భవంతులు ఉన్నా, ఆరోగ్యం లేకపోతే ఉపయోగం లేదు. ప్రభుత్వం త్వరలో సంజీవని ప్రాజెక్టును రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనుంది. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టును చిత్తూరు జిల్లాలో అమలు చేస్తున్నాం. ఇది కంప్లీట్ హెల్త్ కేర్ ప్రోగ్రాం. ప్రతీ ఒక్కరికి డిజిటల్ హెల్త్ రికార్డులు తీసుకొస్తున్నాం. అత్యుత్తమ మిగతా 2లో..



## ప్రతిష్టాత్మకంగా యోగా డే

- జిల్లాకో ప్రత్యేక థీమ్... టూరిజం ప్రాంతాల వేదికగా యోగా దినోత్సవం
- జూన్ 7 నుంచి 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు-యోగా నెలగా జూన్
- పవన్ కళ్యాణ్‌పై తెలంగాణ నేతల వ్యాఖ్యలు సరి కావు
- తమిళనాడుతో నాతో సహా వివిధ రాష్ట్రాల నేతలు ప్రచారం చేయలేదా..?
- ఏ ప్రాంతానికి ఎవరేం చేశారో ప్రజలకు తెలుసు
- డీఎస్సీ నిర్వహణ అనేది టీడీపీ బ్రాండ్
- మంచి పనులపై బురద జల్లడమే కొందరు పనిగా పెట్టుకున్నారు
- మీడియా కాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి,(ప్రజా ప్రతిభ):** ప్రతి ష్టాత్మకంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు మిగతా 2లో..



## కర్నాటక సీఎంగా డికె.శివకుమార్ ప్రమాణస్వీకారం

- ఉపముఖ్యమంత్రిగా జి. పరమేశ్వర్
- మొత్తం 13 మంది మంత్రుల ప్రమాణం
- సిద్ధరామయ్య, ఖర్గేల తనయులకు కేబినేట్‌లో చోటు
- కార్యక్రమానికి హాజరైన రాహుల్, ఖర్గే, వేణుగోపాల్ , రేవంత్ రెడ్డి

**బెంగళూరు,జూన్ 3(ప్రజా ప్రతిభ):** కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. మిగతా 2లో..



## గురజాడ గురుతులు.. సజీవ స్మృతులు..

- పవన్ కళ్యాణ్ చొరవతో అభ్యుదయ కవి నివాస గృహ పునరుద్ధరణ
- ఆడిటోరియం నిర్మాణానికి రూ.1.20 కోట్లతో ప్రతిపాదనలు
- గురజాడ రచనల డిజిటలైజేషన్ ప్రక్రియ ప్రారంభం
- విశాఖ సేనతో సేనాని సభలో ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న ఉప ముఖ్యమంత్రి

**విజయనగరం, జూన్ 3(ప్రజా ప్రతిభ):** ప్రముఖ సంఘ సంస్కర్త, అభ్యుదయ కవితా పితామహుడిగా పేరు గాంచిన గురజాడ అప్పారావు మిగతా 2లో..

## రష్యా పర్యటనలో పెట్టుబడుల వేట

- పలు సంస్థల ప్రతినిధులతో లోకేశ్ భేటీ
- కెమికల్ సంస్థ రస్‌కెమ్ గ్రూపు సిఇవోతో చర్చలు
- రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్ ప్రతినిధులతో సమాలోచనలు

**మాస్కో, జూన్3(ప్రజా ప్రతిభ):** రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి లోకేష్, మాస్కోలో కీలక సమావేశం నిర్వహించారు. రష్యాలో గ్యాస్ ఫీల్డ్స్, మిథనాల్ మిగతా 2లో..



## ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం

- 21మంది దుర్మరణం చెందినట్లు గుర్తింపు
- ప్రమాద ఘటనపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి

**న్యూఢిల్లీ,జూన్3(ప్రజా ప్రతిభ):** దేశ రాజధాని ఢిల్లీలోని ఓ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిప్రమాదం కారణంగా 21 మంది చనిపోగా.. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మల్వియా నగర్‌లోని, హౌజ్ రాణీ లైన్‌లో ఐదంతస్తుల భవనం ఉంది. భవనం బేస్‌మెంట్‌లో 'లెమన్ గ్రీన్ రెస్టారెంట్' ఉంది. బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో




రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటల్లో చిక్కుకుని 21 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న మిగతా 2లో..

## తప్పుడు ప్రచారాలు చేస్తే.. క్రిమినల్ కేసులు తప్పవు..?

- హోంమంత్రి అనిత హెచ్చరిక
- ప్రభుత్వంపై బురదజల్లడం వైసీపీకి అలవాటుగా మారింది
- ఉపాధ్యాయులను మద్యం దుకాణాల ముందు నిలబెట్టిన ఘనత మీదే..
- డీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదు

**అమరావతి, జూన్ 03 (ప్రజా ప్రతిభ):** కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా, ఎంతో పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ పరీక్షలపై తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని, అలాంటి వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ప్రభుత్వంపై బురదజల్లడమే



అలవాటుగా మార్చుకున్న వైసీపీ నాయకులకు, సమాధానాలు వినే ఓపిక కూడా లేదంటూ ఆమె ధ్వజమెత్తారు.

**ఉపాధ్యాయుల గౌరవాన్ని తీసేసింది మీరే..**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులను తీసుకెళ్లి మద్యం దుకాణాల ముందు నిలబెట్టిన ఘనత మిగతా 2లో..



## గంగపాలెంలో పెద్దపులి సంచారం

- పలు పశువులపై దాడి చేసి చంపిన పులి
- ఆందోళనలో స్థానిక ప్రజలు

**ఏలూరు,జూన్3(ప్రజా ప్రతిభ):** పోలవరం జిల్లా దేవీపట్నం మండలం గంగపాలెంలో పెద్దపులి సంచారం కలవరపెడుతోంది. మంగళవారం రాత్రి పశువులపై దాడి చేసిన పులి.. 16 దూడలు, ఒక గేదెను హత మార్చింది. దీంతో గ్రామస్థుల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో భారీగా పశువులు ఉండటంతో మిగతా 2లో..



## రాష్ట్రాలు వేరైనా తెలుగువారంతా ఒక్కటే

- ప్రజాస్వామ్యంలో ఎవరు ఎక్కడైనా రాజకీయం చేయొచ్చు
- పవన్ కళ్యాణ్‌పై విమర్శల నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్య

**అమరావతి,జూన్ 3(ప్రజా ప్రతిభ):** రాష్ట్రాలు వేరైనా తెలుగువారంతా ఒక్కటేనని, అనవసర వివాదాలతో ప్రాంతీయ విద్వేషాలు సృష్టించడం సరికాదని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మిగతా 2లో..

## డీఎస్సీ-2025పై సీబీఐ విచారణ జరగాలి


- లేకపోతే మేం అధికారంలోకి వచ్చాక విచారణ కమిషన్
- డీఎస్సీ-2025లో అంతులేని అక్రమాలు
- ఇష్టారాజ్యంగా జీఓలు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు
- దీని వల్ల అర్హులైన అభ్యర్థులకు అన్యాయం
- వారి తరపున పార్టీ నుంచి న్యాయ పోరాటం చేస్తాం
- అందుకోసం లీగల్ ప్యానెల్ ఒకటి ఏర్పాటు చేస్తాం
- అన్యాయం జరిగిన డీఎస్సీ అభ్యర్థులు బాధ పడొద్దు
- ఏ మాత్రం ధైర్యం కోల్పోవద్దు.. ఓపిగ్గా ఉండాలి
- అవసరమైతే ఇలాంటి వారికి అదనపు పోస్టులు
- డీఎస్సీ అభ్యర్థుల ఆవేదన, బాధ, గోడు అన్నింటినీ సావధానంగా విన్న వైయస్ జగన్ భరోసా
- వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు జగన్‌తో పలువురు డీఎస్సీ-2025 అభ్యర్థుల భేటీ

**తాడేపల్లి,జూన్ 3(ప్రజా ప్రతిభ):** వన్ ఈజ్ టు వన్ రేషియోలోనే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిల్చి, అన్నింటా సక్సెస్ అయిన అనేక మంది డీఎస్సీ-2025 అభ్యర్థులకు ఉద్యోగాలు రాకపోవడం అత్యంత హేయమని, ఇంత కంటే దారుణం మరొకటి ఉండదని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్షేపించారు. ఈ పరీక్ష నిర్వహణ, ఎంపికలో అంతులేని అక్రమాలు చోటు చేసుకున్న విషయం డీఎస్సీ అభ్యర్థులు చెబుతున్న విషయాలను బట్టి తెలుస్తోందని, అందుకే డీఎస్సీ-2025పై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్



చేశారు.

ఇష్టారాజ్యంగా జీఓలు జారీ చేసి, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు ఇచ్చారని, దీని వల్ల ఎందరో అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరిగిందని వైయస్ జగన్ వెల్లడించారు. వారి తరపున పార్టీ నుంచి న్యాయ పోరాటం చేస్తామన్న ఆయన అందుకోసం లీగల్ ప్యానెల్ ఒకటి ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అధికారంలోకి రాగానే, కమిషన్ వేసి విచారణ జరిపిస్తామని, అన్యాయానికి గురైన అభ్యర్థులకు అవసరమైతే అదనపు పోస్టులు ఇస్తామని పార్టీ కేంద్ర కార్యాలయంలో తనను కలిసి, తమ బాధ చెప్పుకున్న పలువురు డీఎస్సీ-2025 అభ్యర్థులకు భరోసా ఇస్తూ వైయస్ జగన్ వివరించారు.



## ఆన్‌లైన్ బెట్టింగ్‌కు రాజ్యాంగ రక్షణ లేదు

- సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,జూన్3(ప్రజా ప్రతిభ):** ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది నైపుణ్యానికి సంబంధించిన ఆట అయినప్పటికీ దానికి రాజ్యాంగ రక్షణ ఉండబోదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. వివిధ క్రీడలపై ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక చేసిన చట్టాల రాజ్యాంగబద్ధతను సమర్థిం చింది. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ అంశాలపై చట్టాలు మిగతా 2లో..

https://prajapratibha.com
RNI : APTEL 2013/54721
ప్రజా ప్రతిభ
ప్రతి అక్షరం ప్రజా పక్షం
తెలుగు దినపత్రిక



# అత్యధిక కాలం ప్రధానిగా మోడీ

## నెహ్రూ రికార్డుకు మోడీ బ్రేక్

**న్యూఢిల్లీ,జూన్3(ప్రజా ప్రతిభ):** నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించబోతున్నారు. ఈ నెల 10న ఇండియాకు అత్యధిక కాలం పని చేసిన ప్రధానిగా నిలవబోతున్నారు. అది కూడా ఎన్నికల్లో గెలిచి, అత్యధిక రోజులు ప్రధానిగా కొనసాగిన జవహర్ లాల్ నెహ్రూను దాటేయబోతున్నారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ మే 13, 1952న పదవీ బాధ్యతలు చేపట్టారు. మే 27, 1964న ఆయన మరణించేవరకు ప్రధానిగానే ఉన్నారు. అలా మొత్తం 4,398 రోజులు ప్రధానిగా కొనసాగారు. ఇంతకాలం పదిలంగా ఉన్న ఈ రికార్డును మోదీ జూన్ 10న చెరిపేయబోతున్నారు. ఈ నెల 10తో మోదీ ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకుంటారు. మోదీ మొదటిసారిగా మే 26, 2014న ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఆయన ప్రధానిగా కొనసాగుతున్నారు. మోదీ ఇంతకుముందు కూడా ప్రధానిగా మరో రికార్డును బద్దలుకొట్టారు. వరుసగా, అత్యధిక కాలం ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ రికార్డును జూలై 5, 2025న దాటేశారు. ఇందిరాగాంధీ జనవరి 24, 1966న ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టి, వరుసగా 4,077 రోజులపాటు కొనసాగారు. ఆమె మార్చి 24, 1977లో వరకు ప్రధానిగా కొనసాగారు. అలా, ఇందిరా గాంధీ కంటే ఎక్కువ రోజులు వరుసగా ప్రధానిగా మోదీ కొనసాగుతున్నారు. స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి దేశ జనాభా దాదాపు 34 కోట్లు. కానీ, మోదీ 2014లో పదవి చేపట్టే సమయానికి దేశ జనాభా 131 కోట్లు. ప్రస్తుతం 146 కోట్లు అని అంచనా. ఇన్నేళ్లలో దేశంలో ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీల భాగస్వామ్యం కూడా పెరిగింది. దేశంలో తొలి ఎన్నికలు జరిగిన 1951?52లో 53 రాజకీయ పార్టీలు పోటీ చేశాయి. 2014 లోక్‌సభ ఎన్నికల సమయానికి దేశంలో 464 పార్టీలు పోటీచేయగా, 2024 ఎన్నికల సమయానికి 744 పార్టీలు పోటీ చేశాయి. దేశ తొలి ఎన్నికల సమయంలో 17 కోట్ల మంది ఓటు వేయగా, 2014 నాటికి దాదాపు 84 కోట్ల మంది ఓటు వేశారు. నెహ్రూ హయాంలో కాంగ్రెస్ ఆధిపత్యమే ఎక్కువగా ఉండేది. అప్పట్లో 489 లోక్‌సభ స్థానాలుంటే అందులో 364 సీట్లు కాంగ్రెస్ దక్కించుకుంది.

# పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం

మొదటిపేజీ తరువాయి..

విద్యాసంస్థలు, పరిశోధనా కేంద్రాలతో హైదరాబాద్ నాలెడ్జ్ సిటీగా గుర్తింపు పొందిందన్నారు.

**మెడికల్ టూరిజానికి ప్రాధాన్యం:** తక్కువ ఖర్చుతో అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో అనేక దేశాల ప్రజలు చికిత్స కోసం హైదరాబాద్‌కు వస్తున్నారని సీఎం తెలిపారు. హైదరా బాద్‌ను ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ రంగంలో దక్షిణాఫ్రికాతో భాగస్వామ్య అవకాశాలను పరిశీలించవచ్చని సూచించారు. డిసెంబర్‌లో జరగనున్న "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026"లో పాల్గొనాలని దక్షిణాఫ్రికా ప్రతినిధులను ఆహ్వానించారు. దీనికి స్పందించిన పాల్ మషాటిలే, పెద్ద సంఖ్యలో ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

**భారత్ ఫ్యూచర్ సిటీపై వివరాలు:** అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న "భారత్ ఫ్యూచర్ సిటీ" ప్రాజెక్టును కూడా సీఎం వివరించారు. పర్యావరణహితంగా, నెట్ జీరో విధానంలో ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో ఈ నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణలో పారదర్శక పారిశ్రామిక విధానాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నాయని తెలిపారు. దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని ఆహ్వానించారు.మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్ల తయారీలో హైదరాబాద్‌కు ప్రపంచస్థాయి గుర్తింపు ఉందన్నారు. ఆరోగ్య రంగంలో తెలంగాణ-దక్షిణాఫ్రికా భాగస్వామ్యం ఇరు ప్రాంతాలకు ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

### భారత్‌తో చారిత్రక బంధం

దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే మాట్లాడుతూ భారత్, దక్షిణాఫ్రికాల మధ్య దశాబ్దాలుగా బలమైన సాంస్కృతిక, ఆర్థిక సంబంధాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా ద్వారా భారత కంపెనీలకు ఆఫ్రికా మార్కెట్లలో విస్తృత అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ముఖ్యంగా ఫార్మా, ఆరోగ్య రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో దక్షిణాఫ్రికా మంత్రులు, ఉన్నతాధికారులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గంగపాలెంలో పెద్దపులి సంచారం

మొదటిపేజీ తరువాయి..

పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు.. మైదాన ప్రాంతాల నుంచి గండి పోచమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులను పోతవరం వద్ద అటవీ శాఖ అధికారులు నిలిపేస్తున్నారు. మొత్తంగా గంగంపాలెం గ్రామం సమీప ప్రాంతాల్లో పెద్దపులి సంచారంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురువుతున్నారు. గత కొద్ది రోజులుగా అటవీ ప్రాంతాల నుంచి గ్రామాల వైపు వస్తున్న పెద్దపులి మూగజీవాలపై వరుసగా దాడులు చేస్తోంది. ఇప్పటివరకు 14 ఆవుదూడలు, 2 గేదెలను చంపింది. దీంతో రైతులు, పశుపోషకులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.గ్రామ శివార్లలో సంచరిస్తున్న పులి పశువుల మందలపై దాడి చేస్తోంది. ముఖ్యంగా గంగంపాలెం, దండంగి, పోశమ్మగండి గ్రామాల పరిసర ప్రాంతాల్లో ప్రజలు బయటకు రావడానికి కూడా భయపడుతున్నారు. పిల్లలను ఒంటరిగా బయటకు పంపకూడదని గ్రామ పెద్దలు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం పెద్దపులి దండంగి గ్రామం, పోశమ్మగండి గ్రామాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. పులి కదలికలను పర్యవేక్షించేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాటు చేశారు. అదేవిధంగా అటవీశాఖ ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి పులిని సురక్షితంగా పట్టుకునేందుకు చర్యలు చేపట్టాయి. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో అటవీ ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని సూచిస్తున్నారు. పులి కనిపించిన వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరుతున్నారు. ఈ ఘటనతో దేవీపట్నం మండలం పరిసర ప్రాంతాల్లో భయాందోళన వాతావరణం నెలకొంది. ఒకవైపు పశువుల నష్టం రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తుండగా, మరోవైపు ప్రజల భద్రతపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పులిని త్వరగా పట్టుకుని తిరిగి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# గురజాడ గురుతులు.. సజీవ స్మృతులు..

మొదటిపేజీ తరువాయి..

జ్ఞాపకాలను భావితరాలకు అందిస్తానని ఇచ్చిన హామీని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిలబెట్టుకున్నారు. పురావస్తు శాఖ సహకారంతో 150 ఏళ్ల క్రితం ఆయన నివాసం ఉన్న ఇంటి పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఆ నివాసానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో సాంస్కృతిక శాఖ సహకారంతో రూ. 1.20 కోట్లతో ఆడిటోరియం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. దీంతోపాటు గురజాడ అప్పారావు రచనల డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా పురావస్తు శాఖ ఆధ్వర్యంలో



ప్రారంభించారు. గురజాడ అప్పారావు నివాస గృహం శిథిలావస్థకు చేరిన విషయాన్ని వార్తా పత్రికల ద్వారా తెలుసుకుని, విశాఖపట్నంలో నిర్వహించిన సేనతో సేనాని సభలో ఆ ఇంటి పునరుద్ధరణతోపాటు ఆడిటోరియం నిర్మాణం, రచనల డిజిట లైజేషన్‌కు హామీ ఇచ్చారు. విజయనగరం కోట జంక్షన్ సమీపంలోని ఈ నివాస గృహంలోనే గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం' రచన చేశారు.

## కర్నాటక సీఎంగా డికె.శివకుమార్
# ప్రమాణస్వీకారం

మొదటిపేజీ తరువాయి..

లోక్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న జి.పరమేశ్వర కర్ణాటక ఉపముఖ్యమంత్రిగా



ప్రమాణస్వీకారం చేశారు.

రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి డీకే ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. తన సీనియర్ అయిన సిద్ధరామయ్యను వేదికపైనే డీకే సత్కరించారు.



జి. పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా, మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటుదక్కింది. డీకే శివకుమార్ క్యాబినెట్ మంత్రులు 13 మంది చేత గవర్నర్ గెహ్లాట్ తావర్‌చందర్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో కేజీ జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరే గౌడ, యూటీ ఖాదెర్, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక ఖర్గే, యతీంద్ర సిద్ధరామ్యయ, లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆరోగ్యం ఉంటేనే సంపద

మొదటిపేజీ తరువాయి..

వైద్య విధానాలను ప్రజల ఇళ్ల దగ్గరకే అందుబాటులోకి తెచ్చేలా సంజీవని పని చేస్తుంది. ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానాన్ని అమలు చేస్తున్నాం. 42 రకాల వైద్య పరీక్షలు ఇంటి దగ్గరే చేస్తాం. ఏ మందులు వేసుకోవాలి, ఎప్పుడు ఆసుపత్రులకు రావాలనే అంశాలను కూడా సంజీవని ద్వారా ప్రజలకు గైడ్ చేస్తాం. త్వరలో యూనివర్సిల్ హెల్త్ పాలసీ తీసుకొస్తున్నాం. ఒకొక్కరికి రూ. 2.50 లక్షల విలువైన వైద్యం ఉచితంగా అందిస్తాం.' అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

### ఆసుపత్రులకు వెళ్లే పరిస్థితి రాకూడదు

'తినే తిండి, మన పరిసరాలు, మన ఆలోచనా విధానం చాలా ముఖ్యం. ప్రభుత్వం ఎన్ని వైద్య సేవలు అందించినా, ఆసుపత్రులు కట్టినా ప్రజలు సరైన ఆహార నియమాలు పాటించాలి. అప్పుడే అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావు. మంచి అలవాట్లు, ఆహారం, వ్యాయామం ఆరోగ్యానికి పనికొస్తాయి. ఫుడ్ మెడిసిన్... కిచెన్ ఫార్మసీ. మనం తినే ఆహారమే మనల్ని రక్షిస్తుంది. ఒకప్పుడు కావాల్సిన పంటలను ఎరువులు లేకుండా పండించారు. కానీ ఈ రోజు మొత్తం యూరియా వాడుతున్న ఆహారం తీసుకుంటున్నాం. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. తెలిసీ తెలియక ఎక్కువగా క్రిమి సంహారక మందులు వినియోగిస్తున్నారు. గత ప్రభుత్వంలో నాసిరకం మద్యం కారణంగా చాలా మందికి ఆరోగ్య సమస్యలు వచ్చాయి. ప్రజల జీవితాలతో చెలగాటమాడారు.' అని సీఎం చంద్రబాబు చెప్పారు.

### రాష్ట్రంలో అత్యుత్తమ ఆరోగ్య సేవలు అందిస్తాం

'హైదరాబాద్‌లో ఒకప్పుడు నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రు లతో పాటు ఇతర చిన్న ఆసుపత్రులు మాత్రమే ఉండేవి. హైదరాబాద్‌లో మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు... నాడు హెల్త్ టూరిజాన్ని ప్రమోట్ చేశాం. దేశంలో ఎక్కడి నుంచైనా ఇప్పుడు హైదరాబాద్ వచ్చి ట్రీట్మెంట్ చేయించుకునే పరిస్థితి నెలకొంది. ఏపీని అదే స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. బెస్ట్ హాస్పటళ్లను రాష్ట్రానికి రప్పిస్తున్నాం. టెక్నాలజీతో వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నాం. హైదరాబాద్ తరహాలో వివిధ ప్రాంతాలకు చెందిన వారు... మెరుగైన వైద్య చికిత్సల కోసం అమరావతికి వచ్చేలా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. కార్పొరేట్ ఆస్పత్రుల్లో యోగా శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలి. ప్రజలకు వైద్యారోగ్య సేవలు అందించే విషయంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ చక్కగా పని చేస్తున్నారు.

టెక్నాలజీని వైద్యారోగ్య రంగానికి అనుసంధానం చేసేలా సత్యకుమార్ యాదవ్ కృషి చేస్తున్నారు. ఇక లలితా హాస్పటల్స్ ఇక్కడ ఆస్పత్రిని ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయం. హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాల్లో కాకుండా... అమరావతిలో ఆస్పత్రిని నెలకొల్పిన యజమాన్యాన్ని అభినందిస్తున్నాను. దశాబ్దాలుగా వైద్య రంగంలో లలితా గ్రూప్



ఉంది. గుంటూరులో ఇలాంటి అత్యాధునిక ఆసుపత్రిని ప్రారంభించుకోవడం సంతోషకరం. బ్రాండ్ ఎస్టాబ్లిష్ చేస్తే దానికి తిరుగుండదు అనడానికి లలితా ఆసుపత్రి ఒక నిదర్శనం. ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత కలగాలి... అప్పుడే ఏ వ్యవస్థకైనా మనుగడ. ఏడు ఎకరాల్లో 600 పడకలతో లలితా ఆసుపత్రి ఏర్పాటైంది. 32 విభాగాలకు సేవలందించే ఏకైక సెంటర్. కార్డియాలజీ, న్యూరాలజీ, జాయింట్ రీప్లేస్మెంట్ వంటి సేవలను ఇక్కడ అందిస్తారు. ల్యాండ్ మార్క్ సంస్థగా లలితా ఆసుపత్రి మారుతుంది.' అని ముఖ్యమంత్రి అన్నారు.

# రష్యా పర్యటనలో పెట్టుబడుల వేట

మొదటిపేజీ తరువాయి..

కెమికల్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న ప్రముఖ సంస్థ రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్, అంతర్జాతీయ వ్యాపార విభాగాధిపతి దర్యా అషానియాలతో ఆయన భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, పలు కీలక ప్రతిపాదనలను వారి ముందుంచారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ భారత్ దిగుమతి చేసుకునే పెట్రోకెమికల్స్, స్పెషాలిటీ కెమికల్స్‌ను ప్రాసెస్ చేసేందుకు వీలుగా, భారత తూర్పు తీరంలోని విశాఖ-కాకినాడ పీసీపీఐఆర్ పరిధిలో రస్ కెమ్ ఆధ్వర్యంలో ఒక అత్యాధునిక ప్రాసెసింగ్ ఎలాంట్ ఏర్పాటు చేయండని ఆహ్వానించారు. పోర్టు ఆధారిత కెమికల్ లాజిస్టిక్స్ హబ్‌ల నిర్మాణం, బల్క్ కెమికల్ స్టోరేజీ వసతులు, ప్రత్యేక వాటర్ ఫ్రంట్ బెర్త్‌ల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అంతేకాకుండా, ఏపీలో అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుని ఒక కొలాబరేటివ్ పాలిమర్ అప్లికేషన్, మెటీరియల్ సైన్స్ పరిశోధన కేంద్రాన్ని స్థాపించాలని సూచించారు. రస్ కెమ్ టెక్నాలజీతో పునరుత్పాదక ఇంధన కారిడార్లను అనుసంధానిస్తూ, తక్కువ కర్బన ఉద్గారాలు వెలువరించే రసాయనాల తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో ప్రత్యేక ఎస్‌పీవీల ద్వారా హోల్‌సేల్ కెమికల్ పంపిణీ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థలతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నామని, ఇప్పటికే ముంబై, కాన్పూర్‌లలోని పంపిణీ కేంద్రాల ద్వారా పరిశ్రమలకు అవసరమైన రసాయనాలను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ సరఫరా కేంద్రం ద్వారా విశాఖపట్నం, కాకినాడలోని ఫార్మా, తయారీ పరిశ్రమలకు కీలక రసాయనాలను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత్‌లోని భారీ పెట్రోకెమికల్ ఎలాంట్లను ఉపయోగించుకుని తమ గ్లోబల్ ఖాతాదారులకు స్థిరమైన సరఫరా అందిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి లోకేష్ చేసిన ప్రతిపాదనలు ఆశాజనకంగా ఉన్నాయని, వీటిపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని ఇల్యా కోసిహ్ తెలిపారు.అలాగే రష్యా ప్రభుత్వ నియంత్రిత ప్రముఖ రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్‌తో నారా లోకేశ్ మాస్కోలో భేటీ అయ్యారు. వెస్ట్రన్ ఎలాట్ ఫామ్‌లకు సురక్షితమైన లోకలైజ్ జనరేటివ్ ఏఐ ప్రత్యామ్నాయ వ్యవస్థను అందించిన తరహాలోనే భారతదేశంలో బ్యాంకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ రంగాలకు స్బేర్ బ్యాంక్ గిగాచాట్ ఎల్ఎల్ఎంను విస్తరించాలని నారా లోకేశ్ కోరారు. జాతీయ యూన్గి÷డ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ నెట్‌వర్క్ భద్రతను పటిష్ఠం చేస్తూ, స్బేర్‌బ్యాంక్ అడ్వాన్స్‌డ్ వాయిస్ రికగ్నిషన్, బయోమెట్రిక్ యాంటీ-ఫ్రాడ్ నెట్‌వర్క్‌ను భారతదేశ బ్యాంకింగ్ మౌలిక సదుపాయాల్లో ఇంటిగ్రేట్ చేసేలా సాంకేతిక సహకారం అందించాలన్నారు. భారత్‌లో పెద్దఎత్తున మున్సిపల్ కార్యకలాపాలను ఆప్టిమైజ్ చేయడానికి కొనసాగుతున్న స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా స్బేర్‌బ్యాంక్ ప్రిడిక్టివ్ అనలిటిక్స్, స్మార్ట్ ట్రాన్సిట్ సర్వైలెన్స్, డిజిటల్ సేఫ్టీ సిస్టమ్‌లను విస్తరించాల న్నారు. ప్రపంచస్థాయి సాఫ్ట్‌వేర్, ఏఐ ఇంజినీర్లకు వేగంగా శిక్షణ ఇవ్వడానికి, స్బేర్ బ్యాంక్ గేమ్డిడ్, పీర్-టు-పీర్ 'స్కూల్ 21' కోడింగ్ అకాడమీలను భారతదేశంలోని ప్రధాన విద్యా కేంద్రాలలో ఏర్పాటు చేయాలని కోరారు. వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలో ఫార్మా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదారుల సౌలభ్యం కోసం దూరప్రాంతాలకు రూపాయి-రూబుల్ వాణిజ్య అనుమతులు, వ్యవస్థీకృత రుణాలు అందించాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

తమ బ్యాంక్ భారత్‌లోని న్యూఢిల్లీ కార్యాలయం ద్వారా ద్వైపాక్షిక కమర్షియల్ ఫైనాన్స్, కార్పొరేట్ బ్యాంకింగ్ కార్యకలాపాలు, భారత్-రష్యా క్లయింట్ డెలివరీ సేవలను అందిస్తున్నట్లు స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్ చెప్పారు. మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రతిపాదనలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌కు రాజ్యాంగ రక్షణ లేదు

మొదటిపేజీ తరువాయి..

రూపొందించేందుకు రాష్ట్రాలకు పూర్తి అధికారం ఉందని జస్టిస్ పార్థివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. సమాజ హితం, శాంతి భద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ఎలాట్‌ఫామ్‌లపై నిషేధం విధించడాన్ని సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పు పట్టింది. అటువంటి ఆటలు ఆడడానికి నైపుణ్యం అవసరమైనా వాటిపై డబ్బులు పందేలు కాస్తే అది 'జూదం' కిందకే వస్తుందని పేర్కొంది. ఆన్‌లైన్ వ్యసనాల వల్ల యువత అప్పుల పాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఈ తీర్పు వెలువరిస్తున్నట్లు తెలిపింది.

## ఢిల్లీ హోటల్‌లో
# ఘోర అగ్నిప్రమాదం

మొదటిపేజీ తరువాయి..

పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో హోటల్‌లో 40 మందికి పైగా జనం ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఎక్కువ మంది మధ్య ఆసియా, ఆఫ్రికాకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది. హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఇస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## రాష్ట్రాలు వేరైనా
# తెలుగువారంతా ఒక్కటే

మొదటిపేజీ తరువాయి..

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని తెలంగాణలో కొందరు నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా, ఎక్కడైనా రాజకీయం చేసే హక్కు ఉంటుందని చంద్రబాబు గుర్తుచేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 'గతంలో నేను తమిళనాడు వెళ్లి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాను. కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ కూడా ఇతర రాష్ట్రాల్లో ప్రచారానికి వెళ్లారు. బీఆర్ఎస్ పార్టీ తాము జాతీయ పార్టీ అని ప్రకటించుకుంది కదా.. ఇప్పుడెందుకు అనవసరంగా మాట్లాడుతున్నారు. అమెరికాలో కూడా తెలుగువారు సెనేటర్లు అవుతున్నారు. ప్రజాసేవ చేసినవారినే ప్రజలు ఆదరిస్తారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు తెలంగాణలో మాట్లాడుతున్న మాటలు ఎంతమాత్రం కరెక్ట్ కాదు. రెండు రాష్ట్రాలుగా విడిపోయి 12 ఏళ్లు అవుతోంది. ఇన్నాళ్ల తర్వాత ఇప్పుడెందుకు మళ్లీ ఇవన్నీ సృష్టిస్తున్నారు. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడం ఎవరికీ మంచిది కాదు. తెలంగాణ రెండు రాష్ట్రాలుగా విడిపోయినప్పటికీ.. తెలుగువారిగా అంతా కలిసికట్టుగా ఉండాలి. రెండు రాష్ట్రాలనూ ప్రగతి పథంలో నడిపించుకోవడమే అందరి లక్ష్యం కావాలి' అని అన్నారు.

# ప్రతిష్టాత్మకంగా యోగా డే

మొదటిపేజీ తరువాయి..

నాయుడు తెలిపారు. కోటి మందితో ఈ నెల 21వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా యోగా డే నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర-2026 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు.యోగాంధ్ర-2026 కార్యక్రమం నిర్వహణపై సీఎం చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టబోయే కార్యక్రమాలను ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో వివరించారు. అలాగే ఇటీవల జరుగుతున్న పరిణామాల పైనా మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందించారు. ఈ సంద ర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."భారతదేశం ప్రపంచానికి అందిం చిన అమూల్యమైన జీవన విధానం యోగా. జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళనలు, అనారోగ్య సమస్యలకు యోగా బెస్ట్ మెడిసిన్. శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక వికాసాన్ని అందించే సమగ్ర ఆరోగ్య సాధన యోగా. యోగాను మన జీవన విధానంలో భాగం చేసేందుకు యోగాంధ్ర ద్వారా ప్రయత్నిస్తున్నాం.

ఈ ఏడాది కూడా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'యోగాంధ్ర-2026' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా కోటి మందిని భాగస్వామ్యం చేయడమే లక్ష్యం. ఈ ఏడాది 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ థీమ్ 'యోగా ఫర్?హెల్దీ ఏజింగ్?'. వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా జీవించేందుకు యోగాను అనుసరించాలని చెప్పడమే థీమ్ ఉద్దేశం. ఇది ఒక్కరోజు కార్యక్రమం కాదు. ప్రతి ఇంట్లో, ప్రతి వ్యక్తి నిత్య సాధనగా అలవాటు చేసుకోవాలి. ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి యోగా ఒక శక్తివంతమైన ఉద్యమంగా మారాలి. ఈసారి యోగాంధ్ర 2026ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. గతేడాది స్ఫూర్తిని కొనసాగించాలి. జూన్ 7 నుంచి 20 వరకు 14 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తాం.

అమరావతిలో జరిగే ప్రధాన కార్యక్రమంలో కృష్ణానది వెస్ట్ బైపాస్ వంతెనపై 25 వేల మందితో యోగా ప్రదర్శన నిర్వహిస్తాం. ప్రతి జిల్లాకు ప్రత్యేక థీమ్ నిర్ణయించాం. ఎన్టీఆర్ జిల్లాలో పోలీసు సిబ్బంది, కోనసీమలో రైతులు వంటి ప్రత్యేక వర్గాలతో కార్యక్రమాలు నిర్వహిస్తాం. ప్రతి జిల్లా కేంద్రంలో 2 వేల నుంచి 3 వేల మంది పాల్గొనే కార్యక్రమాలు నిర్వహిస్తాం. రాష్ట్రంలోని 56 ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లోనూ ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించి యోగా-టూరిజాన్ని ప్రోత్సహిస్తాం. ఉండవల్లి గుహలు, శ్రీశైలం వంటి చారిత్రక ప్రాంతాలు వేదికలుగా ఈ యోగా కార్యక్రమం చేపడు తున్నాం."అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

# ఎపి ప్రకృతి వ్యవసాయానికి గుర్తింపు

## ప్రతిష్ఠాత్మక ఫుడ్ ప్లానెట్ ప్రైజ్-2026' పురస్కారం

**అమరావతి,జూన్ 3(ప్రజా ప్రతిభ):** ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ కార్యక్రమానికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. ప్రతిష్ఠాత్మక 'ఫుడ్ ప్లానెట్ ప్రైజ్-2026' పురస్కారం ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంకు దక్కింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ఇది రాష్ట్రానికి లభించడం గర్వకారణమని



పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం విజయవంతంగా అమలవుతోందన్నారు. రైతులు, గ్రామీణ మహిళలు, వ్యవసాయ శాఖ అధికారులు, ఖా సంస్థ, శాస్త్రవేత్తల సమిష్టి కృషి ఫలితంగానే ఈ అంతర్జాతీయ గుర్తింపు లభించిందని తెలిపారు. ప్రపంచ స్థాయిలో లభించిన ఈ పురస్కారాన్ని రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులకు అంకితం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతమైన ఈ నమూనాను దేశంలోని 21 రాష్ట్రాలతో పాటు విదేశాల్లో కూడా అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. సుస్థిర వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ గుర్తింపు రైతాంగ అభివృద్ధికి కొత్త అవకాశాలు తీసుకురావడంతో పాటు ప్రకృతి వ్యవసాయానికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని అచ్చెన్నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు.

## చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు

# కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### వైసీపీ శ్రేణులకు ఎమ్మెల్యే తాటిపత్రి చంద్రశేఖర్ పిలుపు

యర్రగొండపాలెం ఆర్ సి ఇంచార్జ్/ డి ప్రసాద్ రెడ్డి, జూన్ 03,(ప్రజా ప్రతిభ).





రాష్ట్ర రాజకీయాల్లో చోటుచేసుకున్న వెన్నుపోటు రాజకీయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరం ఉందని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపత్రి చంద్రశేఖర్ పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. యర్రగొండపాలెం పార్టీ కార్యాలయంలో బుధవారం వెన్నుపోటు కు రెండేళ్లు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల తీర్పును గౌరవించకుండా రాజకీయ స్వార్థాల కోసం జరిగిన పరిణామాలను ప్రజలకు వివరించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలకు విరుద్ధంగా వ్యవహరించడం, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగించే చర్యలను ప్రజల ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి వైసీపీ కార్యకర్తపై ఉందని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించే ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వెన్నుపోటు రాజకీయాల ప్రభావాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు, ప్రజల ముందు వాస్తవాలను ఉంచేందుకు చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టాలి

### జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత

యర్రగొండపాలెం ఆర్ సి ఇంచార్జ్/ డి ప్రసాద్ రెడ్డి, జూన్ 03,(ప్రజా ప్రతిభ).

ఈ ఏడాది ఎల్‌నిన్యో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని రైతులు ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం వ్యవసాయ శాఖ రూపొందించిన "ఎల్‌నిన్యో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులు సాగు చేయాల్సిన పంటలు, అనుసరించాల్సిన విధానాలు" అనే పుస్తకాన్ని ఆమె వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా మొక్కలు దృఢంగా పెరిగి వర్షాభావ పరిస్థితులను తట్టుకునే సామర్థ్యాన్ని పొందుతాయని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. వారు రైతులకు వివిధ రకాల కషాయాల తయారీ, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీ విధానాలను ప్రత్యక్షంగా చూపించి అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. దీర్ఘకాలిక పంటలకు బదులుగా పెసర, మినుము, సజ్జ, అలసంద వంటి తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే పంటలను సాగు చేస్తే రైతులు నష్టాలను నివారించవచ్చని కలెక్టర్ సూచించారు. అలాగే రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడం ద్వారా అన్ని పంటలకు మేలు జరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ కె.ఐ. సుదర్శన్ రాజు, వ్యవసాయ శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి బాలాజీ నాయక్, ఎర్రగొండపాలెం ఏడీఏ రమణతో పాటు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



## చంద్రబాబు రెండేళ్ల వెన్నుపోటు

# కార్యక్రమాలను జయప్రదం చేద్దాం....

### వైసీపీ నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్

మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్, జూన్ 03,( ప్రజా ప్రతిభ ):

ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల కాలం పూర్తి చేసుకొని మూడవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నప్పటికీ ఇచ్చిన హామీలను అమలు పరచని నేపథ్యంలో వైసిపి అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చంద్రబాబు రెండేళ్ల వెన్నుపోటు కార్యక్రమం ఈనెల నాలుగవ తేదీ నుండి 4వ తేదీ న మార్కాపురం నియోజకవర్గంలో జరుగుతుందని మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు,జంకె వెంకటరెడ్డి లు తెలిపారు..బుధవారం న పట్టణంలోని స్థానిక వైసీపీ కార్యాలయంలో చంద్రబాబు రెండేళ్ల వెన్నుపోటు కార్యక్రమాల పోస్టర్ను



స్థానిక నాయకులతో కలసి మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు,జంకె వెంకటరెడ్డి లు ఆవిష్కరించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల కాలం పూర్తయిన ఎన్నికల్లో ఇచ్చిన హామీలు చేయడం లో విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా వైసీపీ మైనార్టీ అధికార ప్రతునిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ మాట్లడుతూ ప్రజాబిష్టం మేరకు వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తలపెట్టిన ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు,కార్యకర్తలు,ప్రజలు భాగస్వామ్యమై జయప్రదం చేయాలని కోరారు..ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

## వెలుగొండ ముంపు గ్రామాల

# సమస్యలపై జాయింట్ కలెక్టర్‌తో ప్రత్యేక సమావేశం.





యర్రగొండపాలెం ఆర్ సి ఇంచార్జ్/ డి ప్రసాద్ రెడ్డి, జూన్ 03,(ప్రజా ప్రతిభ).

వెలుగొండ ప్రాజెక్ట్ ముంపు గ్రామాల ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధించి మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ముంపు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వెలుగొండ ప్రాజెక్ట్ కారణంగా ప్రభావితమైన గ్రామాల ప్రజలు పునరావాసం, పరిహారం, మౌలిక సదుపాయాల కల్పన, జీవనోపాధి సమస్యలు తదితర అంశాలపై తమ ఆవేదనను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న సమస్యలను వివరించి, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ, వెలుగొండ ప్రాజెక్ట్ ముంపు గ్రామాల ప్రజలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం మరియు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు, ముంపు గ్రామాల ప్రజలు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజల సమస్యలపై జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కడంఅలవర్చుకోవాలి

### ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్ల సైకిల్ యాత్ర

అరకు లోయ, జూన్ 3 ( ప్రజా ప్రతిభ ):

మేరా యువర్ భారత డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు సూచనల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వేలి పరిధిలో మజ్జి వలస గ్రామంలో సైకిల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రోజు సైకిల్ తొక్కడం వల్ల శారీరిక మానసిక దృఢత్వం కలుగుతుందని, నిత్య జీవితంలో సైకిల్ ఒక భాగం కావాలని ప్రపంచ సైకిల్ దినోత్సవ సందర్భంగా ప్రతి ఒక్కరు సైకిల్ తొక్కే అలవర్చుకోవడం మంచిది. దేశ ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను ప్రవేశపెట్టింది అందులో భాగంగా సైకిల్ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రజలకు తిరిగి సైకిల్ అలవాటు చేసేందుకు ఈ కార్యక్రమాన్ని గిరి గ్రామంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పలు చోట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సైకిల్ యాత్ర కొనసాగించారు. భారత మాతకు జై నినాదాలతో యాత్ర సాగింది.



# అక్రమ రవాణాకు సిద్ధమైన

### రేషన్ బియ్యం పట్టివేత 1922 కేజీల రేషన్ బియ్యం సీజ్.



యర్రగొండపాలెం ఆర్ సి ఇంచార్జ్/ డి ప్రసాద్ రెడ్డి, జూన్ 03,(ప్రజా ప్రతిభ).

మార్కాపురం పట్టణంలోని చౌక దుకాణం నెం.6లో రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారం రెవెన్యూ అధికారుల తనిఖీల్లో వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం అందడంతో అధికారులు ఆకస్మికంగా దుకాణాన్ని తనిఖీ చేయగా, అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 1922 కేజీల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ఈ విషయంపై అధికారులు విచారణ చేపట్టగా ఆరోపణలు నిజమని నిర్ధారణ కావడంతో సంబంధిత చౌక దుకాణంపై 6ఏ కేసు నమోదు చేశారు. అనంతరం స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సీజ్ చేయడంతో పాటు దుకాణాన్ని కూడా అధికారులు సీజ్ చేసినట్లు వెల్లడించారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ సాలమ్మ, గ్రామ రెవెన్యూ అధికారులు కోటేశ్వరావు, రమణారెడ్డి పాల్గొన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

### కొట్టుకుపోయిన కల్వర్టు

### గిరిజన గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు



అరకులోయ, జూన్ 3( ప్రజాప్రతిభ ):

అరకువేలి మండలం లోతేరు పంచాయితీలో రోడ్డు కాంట్రాక్టుల ఘోర నిర్లక్ష్యం బయటపడింది. నిబంధనల ప్రకారం పనులు చేయకపోవడం నాణ్యత లోపం కారణంగా స్థానిక కల్వర్టు ఒక్కసారిగా వరద తాకిడికి కొట్టుకుపోయింది. స్థానిక ప్రజలు తెలిపిన వివరాలు ప్రకారం ఈ కల్వర్టు నిర్మాణంలో కాంట్రాక్ట్ తీవ్ర నిర్లక్ష్యం వహించారు. పనులు పూర్తి చేయకుండా అరకొరగా వదిలేయడం వేసిన కల్వర్టు లో నాణ్యత లేకపోవడం వల్ల కురిసిన సాధారణ వర్షాలకే కల్వర్టు పూర్తిగా కొట్టుకుపోయింది. దీనివల్ల లోతేరు పంచాయతీ పరిధిగల అంటిపార్టి ,ముసిరిగూడ. దుద్దుకోండి , అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర పరిస్థితులకు వెళ్లాలన్న నిత్యవసర సరుకులు తెచ్చుకోవాలన్న గిరిజనులు వాగు దాటలేక ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని జీవిస్తున్నారు. ఉన్నత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని తాత్కాలికంగా నైనా రాకపోకలు సాగేలా మార్గం ఏర్పాటు చెయ్యాలని స్థానిక మాజీ వార్డ్ మెంబర్ కొర్ర. స్వామి, సుబ్బారావు, గంగు నాయుడు తదితరు డిమాండ్ చేశారు.

# ఘనంగా ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

### విజేత అనంతగిరి టీమ్

### బహుమతి అందించిన ఎస్సై కే శంకర్రావు.



అనంతగిరి,న్యూస్ : జూన్ 3 ( ప్రజా ప్రతిభ ):



మండలంలోని కొండిబ పంచాయతీలో గత కొన్ని రోజులుగా 32 జట్లతో సాగిన క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ఎస్సై కే శంకర్రావు ముఖ్య అతిథిగా హాజరై ఫైనల్ మ్యాచ్ విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. టోర్నమెంట్‌లో అనంతగిరి జట్టు ప్రథమ స్థానం (రూ. 15,000), సాడ జట్టు ద్వితీయ స్థానం (రూ. 10,000) కైవసం చేసుకున్నాయి. కొర్ర శ్రీను (మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్), చరణ్ (బెస్ట్ బౌలర్), పాంగి సురేష్ (బెస్ట్ బ్యాట్స్‌మెన్) అవార్డులు గెల్చుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై శంకర్రావు మాట్లాడుతూ యువత సోషల్ మీడియా, వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడా స్ఫూర్తితో సమాజాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు సార దొన్ను, గాసి, సమర్థి, నిర్వాహకులు బలరాం, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పొలిగూడలో పిడుగు పడి 8 మేకల మృతి

## నష్టపరిహారం ఇవ్వాలని

### ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్.





**అరకులోయ, జూన్ 3( ప్రజా ప్రతిభ):**

మండలంలోని లోతేరు పంచాయతీ పొల్లిగూడ గ్రామంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పిడుగు పడి 8 మేకలు మృతి చెందాయాని ఎప్పటి లాగానే కొండపైకి మేతకు తీసుకుని వెళ్లి ఉండగా పిడుగు పడడంతో ఆ గ్రామంలోని బట్నాయక్ భాస్కర్ కు చెందిన మూడు మేకలు, బట్నాయక్ శ్రీరాములుకు చెందిన రెండు మేకలు, కేరంగి చంపకు చెందిన మూడు మేకలు మృతి చెందినట్లు ఆ గ్రామస్తులు తెలిపారు. ఆదివాసి గిరిజనులకు చెందిన ఈ మేకలు పిడుగుపాటుకు మృతి చెందడంతో ఆర్థికంగా వారు తీవ్రంగా నష్టపోయారని వారికి వెంటనే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఆదుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ కోరారు. పిడుగు పడి మేకలు మృతి చెందిన విషయాన్ని పశుసంవర్ధక శాఖ అధికారులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు పొద్దు బాలదేవ్ తెలిపారు. పొలిగూడ గ్రామానికి చెందిన సుబ్బారావు , రామచందర్ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు తెలిపారు.

# పెద్ద కన్నరావు కుటుంబానికి ఆర్థిక సహాయంఅందజేత



**వరరామచంద్రపురం, జూన్ 3(ప్రజా ప్రతిభ ):**

విఆర్ పురం మండలం చిన్నమట్టపల్లి పంచాయతీ పత్తిపాక గ్రామం కు చెందిన పెద్ద కన్నరావు గత నెల పాముకాటుకి చనిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ సుందర్ ప్రసాద్ ఆ కుటుంబనికి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఆ కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ సోడి కవిత,వేటి సంధ్య,గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ పిట్ట రామారావు,కోటం జయరాజు, కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# తాగు నీటి సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే



**వరరామచంద్రపురం, జూన్ 3(ప్రజా ప్రతిభ ):**

విఆర్ పురం మండలం చొప్పల్లి గ్రామంలో కొంత భాగం ఎంతోకాలంగా తాగునీటి సమస్యతో ఆ గ్రామస్తులు బాధపడుతున్నారు,సర్పంచ్ పదవి కాలం ముగియడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి తో చెప్పగా వారు వెంటనే స్పందించి తక్షణమే అధికారలతో చెప్పి ఆ సమస్యను పరిష్కరించినారు ఎంత కాలంగానో నీటి సమస్యతో బాధపడుతున్న చొప్పల్లి గ్రామస్తులు ఆనందంతో ఎమ్మెల్యే కి మరియు టిడిపి మండల అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఐటిడిపి కన్వీనర్ ఆకోజు భాగ్యలక్ష్మి, మాజీ ఎంపీటీసీ ఉర్మ ఆదమ్మ, సీనియర్ నాయకులు బోదె బోయిన సురేష్ రావు, బొర్రా సూరిబాబు,మీడియం వీరయ్య, ఉర్మ సీతారామయ్య, ఊర్మ బుచ్చయ్య, కారం చిరంజీవి, నీలం రాజా,జంగాల ప్రేమ్ సాగర్, కారం సత్యం, ధర్మల బాబు, కారం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ ఎరువులు వాడకం శ్రేయస్కరం

**నాతవరం, జూన్,03,(ప్రజా ప్రతిభ)**

పంటలకు సేంద్రియ ఎరువులే శ్రేయస్కరమని మండల వ్యవసాయ అధికారిని జి, సుగుణ తెలిపారు బుధవారం ఖేత్ బచావో అభియాన్ - 2026 కార్యక్రమంలో భాగంగా నాతవరంలో ఇంటింటికి వెళ్లి సేంద్రియ ఎరువులు పై విస్తృత ప్రచారం చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకరమైన నేల అధిక దిగుబడి అధిక ఆదాయం కోసం రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించుకోవాలని సేంద్రియ మరియు సహజ వ్యవసాయ పద్ధతులలో ఉపయోగించుకోవాలని నీటిని పొదుపుగా వినియోగించి పచ్చిరొట్ట ఎరువులను వాడాలన్నారు యూరియా వాడకం తగ్గించి నానో యూరియా వాడాలన్నారు ఈ కార్యక్రమంలో ఆర్ఎస్కే సిబ్బంది రైతులు పాల్గొన్నారు



## స్వాతంత్య్రం వచ్చి

# 78 ఏళ్లయినా తీరని దాహం

**గుముడుపాడులో మంచినీటి కోసం ఆదివాసీల అగచాట్లు.**
**గ్రామాన్ని సందర్శించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన**
**ఆదివాసీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సోమేల స్వామి.**





**అనంతగిరి,న్యూస్ : జూన్ 3( ప్రజా ప్రతిభ):**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ కనీస తాగునీటి వసతికి నోచుకోక మారుమూల ఏజెన్సీ గ్రామాల్లోని సామాన్య ప్రజలు అల్లాడిపోతున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పెదబిడ్డ పంచాయతీ పరిధిలోని గుముడుపాడు గ్రామంలో దశాబ్దాలుగా తాగునీటి సమస్య తాండవిస్తోంది. సుమారు 10 కుటుంబాలకు చెందిన 30 మందికి పైగా జనాభా ఉన్న ఈ ఆదివాసీ గ్రామానికి నేటికీ సురక్షిత మంచినీటి సౌకర్యం కల్పించకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**గ్రామాన్ని సందర్శించిన ఆదివాసీ పరిరక్షణ సమితి.**

గుముడుపాడు గ్రామస్తులు పడుతున్న తాగునీటి కష్టాల గురించి తెలుసుకున్న ఆదివాసీ పరిరక్షణ సమితి అనంతగిరి మండల అధ్యక్షుడు సోమేల స్వామి బుధవారం సదరు గ్రామాన్ని సందర్శించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న ప్రత్యక్ష నరకాన్ని, నీటి కోసం పడుతున్న ఇబ్బందులను ఆయన స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం ఈ తీవ్రమైన ప్రజా సమస్యను ప్రభుత్వం మరియు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

**అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి - గ్రామస్తుల డిమాండ్:**

ఈ సందర్భంగా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తూ.. ఏళ్లు గడుస్తున్నా ఏ ఒక్క అధికారి గానీ, రాజకీయ నాయకుడు గానీ తమ గ్రామం వైపు కన్నెత్తి చూడలేదని వాపోయారు. మైళ్ల దూరం నడిచి వెళ్లి ఊట బావులు, చెలమల నుంచి తెచ్చుకునే కలుషిత నీటినే తాగాల్సి వస్తోందని, దీనివల్ల రోగాల బారిన పడుతున్నామని కన్నీరుమున్నీరయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ బాధలను ఆలకించాలని, వెంటనే గుముడుపాడు గ్రామానికి శాశ్వత మంచినీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు, సోమేల స్వామి తీవ్రంగా డిమాండ్ చేశారు.

# కుమిడికుంటి గ్రామస్తులు ఏకమై రోడ్డు శ్రమదానం

## తక్షణమే సీసీ లేదా బీటీ రోడ్డు

## మంజూరు చేయాలని గ్రామస్తుల విజ్ఞప్తి



**అరకు లోయ, జూన్ 3 ( ప్రజా ప్రతిభ):**

డుంబ్రిగుడ మండలంలోని కొల్లాపుట్టు పంచాయతీ పరిధిలో ఉన్న కుమిడికుంటి గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శ్రమదానంతో రోడ్డును మరమ్మతు చేసుకుంటున్నారు. ఎన్నో సంవత్సరాలుగా సరైన రహదారి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామ ప్రజలు తమ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామస్తుల వివరాల ప్రకారం, 2016-17 సంవత్సరాల్లో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. కొంతమేర పనులు నిర్వహించినట్లు చేసి మధ్యలో డస్ట్ పోసి పనులను నిలిపివేశారని వారు ఆరోపించారు. అనంతరం పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఎలాంటి పరిష్కారం లభించలేదని తెలిపారు. గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వంతాల సీతారాం మాట్లాడుతూ, గతంలో వేసిన రోడ్డు భారీ వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతినడంతో ప్రస్తుతం రాకపోకలు అత్యంత ప్రమాదకరంగా మారాయని తెలిపారు. ముఖ్యంగా రోడ్డు మలుపుల వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. రోడ్డు మరింత దెబ్బతినకుండా ఉండేందుకు గ్రామస్తులే శ్రమదానంతో పెద్ద బండరాళ్లు పేర్చి రక్షణ గోడ నిర్మించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. అలాగే భారీ వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డుపై మట్టిని పోసి తాత్కాలికంగా రాకపోకలు కొనసాగించేలా చర్యలు చేపట్టారు. అయితే ఇది శాశ్వత పరిష్కారం కాదని, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన రహదారి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చినప్పుడు, గర్భిణీలు, వృద్ధులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కుమిడికుంటి గ్రామానికి సీసీ రోడ్డు లేదా బీటీ రోడ్డు మంజూరు చేసి గ్రామ ప్రజల రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుమిడికుంటి గ్రామానికి నాణ్యమైన రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. ఈ శ్రమదాన కార్యక్రమంలో గ్రామస్తులు వంతాల సీతారాం (ఆటో డ్రైవర్), వంతాల చిన్నయ్య, వంతాల దాసు (పీసా కమిటీ కార్యదర్శి), వంతాల నర్సులు, కొర్రా శాంతి తదితరులు పాల్గొన్నారు.



## పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల

# పెంపుపై నిరసనలు విజయవంతం చెయ్యాలి

## వామపక్ష పార్టీలు పిలుపు.

**అల్లూరి జిల్లా గూడెం కొత్త వీధి (చింతపల్లి), జూన్ 3 ప్రజా ప్రతిభ**

పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరల వరుస పెంపులను నిరసిస్తూ జూన్ 1 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించే ప్రచార ఆందోళనలను విజయవంతం చేయాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చాయి.సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి అప్పలవలస, సీ పీ ఐ పార్టీ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మే నెలలో కేవలం 11 రోజుల వ్యవధిలో నాలుగు సార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై అదనపు భారం మోపిందని విమర్శించారు. మే 15న లీటరుకు రూ.3 చొప్పున పెంపు చేయగా, మే 19న 90 పైసలు, మే 23న పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్‌పై 90 పైసలు, మే 25న పెట్రోల్‌పై 86 పైసలు, డీజిల్‌పై 83 పైసలు పెంచినట్లు తెలిపారు.అలాగే వంట గ్యాస్ ధరలను భారీగా పెంచడం వల్ల చిన్న వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ధరల పెరుగుదల కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి ప్రజల జీవన వ్యయం అధికమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన ఇంధన, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జూన్ 1 నుంచి 6 వరకు చేపట్టనున్న ప్రచార ఆందోళనల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వామపక్ష పార్టీలు కోరాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు సిగ్గే పోతురాజు, సిపిఎం జిల్లాకమిటి సభ్యులు వంపురంగి బుజ్జిబాబు, సిపిఎం పార్టీ చింతపల్లి మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్, మండల కమిటీ సభ్యులు సాగిన చిరంజీవి, బాకూరు కోటేశ్వరరావు పాల్గొన్నారు.



# స్వచ్ఛపథం తోనే గ్రామాల పరిశుభ్రం

**నాతవరం, జూన్, 03,(ప్రజా ప్రతిభ)**

మండలంలోని మాధవనగరం గ్రామంలో బుధవారం స్వచ్ఛపథం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన రహదారుల ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు కాలువలను శుభ్రం చేశారు. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎంఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పంచాయతీ సిబ్బందికి అందించాలని సూచించారు. పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.కళ్యాణ్ కృష్ణ, మాజీ ఎంపీటీసీ శివలంక మారిణేశ్వరరావు,టిడిపి నాయకులు గంటా శ్రీను, తెలుగు యువత ఉపాధ్యక్షులు కశింకోట గోవిందరావు జనసేన నాయకుడు గుడివాడ కృష్ణ,మహిళా నాయకులు కూనిశెట్టి భారతి, సోముల మంగ, వైసిపి నాయకులు సిద్దాబత్తుల రమణతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.



# హుకుంపేట మండలంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మండల గ్రీవెన్స్) నిర్వహణ

## ప్రజల వద్దకే పీజీఆర్ఎస్ 160 అర్జీలు
## జిల్లా కలెక్టర్ నిషాంతి. టి




**అల్లూరి జిల్లా బ్యూరో( పాడేరు) /?హుకుంపేట, జూన్ :03, ప్రజా ప్రతిభ**

ప్రజల సమస్యలను వారి వద్దకే వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని, త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంతో హుకుంపేట మండల కేంద్రంలో ప్రత్యేక 'ప్రజా పరిష్కార వేదిక' (మండల గ్రీవెన్స్) కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెకర్ నిషాంతి. టి ,జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ స్వయంగా పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనలు, సీసీఎల్ఏ మేడం ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలోనూ, ప్రతి వారం ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని ఈ మండల గ్రీవెన్స్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత వారం అనంతగిరిలో నిర్వహించగా, ఈ వారం హుకుంపేట మండలంలో దీనిని చేపట్టడం జరిగిందన్నారు.



మండల పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల నుండి ?అత్యధికంగా ప్రజలు పాల్గొని వారి సమస్యలను అర్జీ రూపేనా తయారు చేసుకుని వచ్చి అర్జీలు కలెక్టర్ ఇచ్చి వారి సమస్యలను తెలిపారు.
సుమారు 6 గంటల పాటు నిరంతరాయంగా సాగిన ఈ గ్రీవెన్స్ కార్యక్రమంలో హుకుంపేట మండలం నుండి రికార్డు స్థాయిలో 160 అర్జీలు వచ్చాయని . ప్రజలకు పాలనను మరింత దగ్గర చేయడం వల్లే ఇంత పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారని కలెక్టర్ తెలిపారు. మండలం నలుమూలల నుండి వచ్చి ప్రజలు వారి సమస్యలను తెలుపుతూ, అలాగే గుత్తం తీగల వలస పంచాయతి నుండి వచ్చిన ప్రజలు రోడ్లు వేసి డోలిమోత నివారించాలని కోరారు. జిల్లా లో ప్రాథమిక వసతులకు ప్రాధాన్యం అలాగే ప్రజల నుండి ప్రధానంగా వచ్చిన సమస్యలలో ,రోడ్లు, తాగునీరు (డ్రింకింగ్ వాటర్),విద్యుత్ సమస్యలపై ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి.రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు, పివిటిజి గ్రామాలు 100 కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు . ఇప్పటికే మంజూరై, గ్రౌండింగ్ దశలో కొన్ని పనులు, పెండింగ్‌లో ఉన్న కొన్ని పనులను వారం రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. సుమారు రూ. 400 కోట్ల విలువైన రహదారి పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని, ప్రాధాన్యత క్రమంలో నిధుల కేటాయింపు జరుగుతుందని స్పష్టం చేశారు.తాగునీటి సమస్యల తక్షణ పరిష్కారం, ఆర్డబ్ల్యూఎస్ శాఖ సమగ్ర ప్రణాళికతో సిద్ధంగా ఉందని, ఏ గ్రామంలోనైనా తాగునీటి సమస్య ఉంటే ఎంపీడీఓ, జడ్పీ సీఈఓలతో మాట్లాడి మండల నిధులు లేదా 'జల్ జీవన్ మిషన్' ద్వారా తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నామన్నారు.రెవెన్యూ, సివిల్ వివాదాలు, రెవెన్యూ పరంగా వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎంఆర్ఓ (తహశీల్దార్) వారికి ఆదేశాలు జారీ చేశారు. సివిల్ కోర్టు పరిధిలో ఉన్న భూ వివాదాలపై స్పష్టమైన నివేదికలు ఇవ్వాలని, అవసరమైన చోట పోలీసు శాఖ సహకారం తీసుకోవాలని సూచించారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ రోజు నిర్వహించిన అత్యంత కీలకమైన ప్రత్యేక ప్రజా పరిష్కార వేదికకు ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరైన 4 నుండి 5 గురు అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విధులకు హాజరుకాని అధికారులకు తక్షణమే 'షోకాజ్ నోటీసులు' జారీ చేసి, కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు.?ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాలు , వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి మంత్రి రాజీవ్ రంజన్ సింగ్
### చేతుల మీదుగా
### ఉత్తమ అవార్డు అందజేత




**నాతవరం, జూన్, 03,(ప్రజా ప్రతిభ)**

నాతవరం మండలం శృంగవరం గ్రామపంచాయతీకి జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు లభించడం ప్రాంతానికి గర్వకారణంగా మారింది. గుడ్ గవర్నెన్స్ విభాగంలో శృంగవరం పంచాయతీ ఎంపిక కావడంతో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు దక్కింది. ఈ మేరకు బుధవారం జాతీయ పంచాయతీరాజ్ అవార్డ్స్ -2026 లో భాగంగా న్యూఢిల్లీలో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేతుల మీదుగా రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కాంతిలాల్ దండే, అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి ఇ.సందీప్, శృంగవరం పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ వి.శ్రీనివాసరావు అవార్డును అందుకున్నారు. గ్రామ పాలనలో పారదర్శకత, పారిశుధ్యం, ప్రజా సేవలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో చూపిన ప్రతిభకు గాను ఈ అవార్డు లభించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ స్థాయిలో సమర్థవంతమైన పాలన, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టిన అభివఅద్ధి కార్యక్రమాలు శృంగవరం పంచాయతీకి ఈ గుర్తింపును తీసుకువచ్చాయని పేర్కొన్నారు. గ్రామ పరిశుభ్రత, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంలో పంచాయతీ సిబ్బంది కృషి అభినందనీయమని తెలిపారు. అవార్డు అందుకోవడం పట్ల మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు

# గూడెం కొత్త వీధి మండలంలోని

### 16 గ్రామపంచాయతీల
### నిధుల వినియోగంపై శ్వేత పత్రం విడుదల చేయండి
### గూడెం కొత్త వీధి ఎంపీడీవోను కోరిన మండల తెలుగుదేశం పార్టీ

**అల్లూరి జిల్లా గూడెం కొత్త వీధి జూన్ 3 ప్రజా ప్రతిభ**

అల్లూరి జిల్లా గూడెం కొత్త వీధి మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల వినియోగంపై పంచాయతీల వారీగా శ్వేత పత్రాలను గ్రామ పంచాయితీ కార్యదర్శులు విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గూడెం కొత్త వీధి తెలుగుదేశం పార్టీ శ్రేణులు కొత్త వీధి మండల అభివృద్ధి అధికారి రమణబాబును కోరారు. గత పంచాయతీ లకు ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలోనే భారీ ఎత్తున నిధులు మంజూరు చేయడం జరిగిందని అయితే ఆ నిధులను ఏ ఏ పనులకు ఎక్కడెక్కడ వాడారు పూర్తిస్థాయి సమాచారాన్ని అందించాలని కోరారు గ్రామపంచాయతీలకు ఉమ్మడి కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు పెద్ద ఎత్తున దుర్వినియోగం జరిగినట్లు సమాచారం ఉందని ముందుగా ప్రతి పంచాయతీ కార్యదర్శి ఆయా పంచాయతీల్లో చేపట్టిన కార్యక్రమాల వివరాలు ఖర్చయిన నిధుల వివరాలు వెల్లడించాలని వారు కోరారు దీనిపై వెంటనే చర్యలు తీసుకొని గ్రామపంచాయతీల్లో నిధుల వినియోగంపై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని వారు ఎంపీడీవోని కోరారు లేదంటే ఈ విషయాన్ని అల్లూరి జిల్లా కలెక్టర్ పాడేరు ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొండలరావు ప్రధాన కార్యదర్శి



నాగమణి మండల పిఎసిఎస్ అధ్యక్షుడు రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి కె బలరాం తో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వెన్నెల పాలెం స్కూల్లో పూర్వ విద్యార్థుల శ్రమదానం



**నాతవరం, జూన్ 03,(ప్రజా ప్రతిభ)**

బుధవారం వెన్నెల పాలెం ఎంపీపీ స్కూల్లో పూర్వ విద్యార్థులుతో పాటు స్థానిక ఎస్సై వీరుతో కలిసి శ్రమదానం చేశారు అంతేకాకుండా ఎస్సై వై, తారకేశ్వరరావు చొరవతో పాఠశాలకు రంగులు వేయించారు ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఈ స్కూలుకి గత చరిత్ర ఎంతో ఉందని ఈ స్కూల్లో విద్య అభ్యసించిన విద్యార్థుల్లో 15 మంది వైద్యులు 12 మంది ఉపాధ్యాయులు, 5గురు సైనిక్ దళాల్లో పనిచేసేవారు మరికొందరు సాఫ్ట్వేర్ రంగంలో కొంతమంది విదేశాల్లో స్థిరపడ్డ వారు కొంతమంది ఉన్నారని ఈ విద్యార్థులు ముందుకు రావడంతో పాఠశాల పునః ప్రారంభోత్సవ సందర్భంగా శ్రమదానం చేయడం అభినందనీయమని నాతవరం ఎస్ఐ, అన్నారు

# రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు

### ప్రభుత్వం అదనపు అంబులెన్సులను ఏర్పాటు చేయాలి.
### చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్,
### కూటమి ప్రభుత్వానికి అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం డిమాండ్.






**అరకులోయ, జూన్ 3( ప్రజాప్రతిభ ):**

గిరిజన ప్రాంతంలో అంబులెన్స్ లు తక్కువ సంఖ్యలో ఉండడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక అంబులెన్స్ లో వివిధ రకాల వ్యాధి బారిన పడిన రోగులు ఉండడంతో ఒక రోగి నుండి మరొకరికి ఇంపెక్షన్లు వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొన్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం. డుంబ్రిగూడ మండలం కోరాపూర్ సమీపంలో జరిగిన బైక్ ప్రమాదం గురించి తెలుసుకొని గాయపడిన యువకులను పరామర్శలో భాగంగా పాడేరు జిల్లా ఆసుపత్రిలో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సందర్శించారు. ఈ సందర్భంగా చికిత్స కొరకు విశాఖపట్నం కెజిహెచ్ ఆసుపత్రికి వెళ్లేవారు. ఒక అంబులెన్స్ లో వివిధ రకాల రోగులకు ఎక్కువ సంఖ్యలో ఒక అంబులెన్స్ లో తీసుకువెళ్లడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక అంబులెన్స్ లో ఎక్కువ సంఖ్యలో రోగులను తీసుకువెళ్లడంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని అన్నారు. ఆది తెలిసి కూడా ఈ విధంగా ఎలా తీసుకెళ్తారని ప్రశ్నించారు. ఒక అంబులెన్స్ కి కనీసం ఫిట్నెస్ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ అందుబాటులో ఉన్న అంబులెన్స్తో అడ్జస్ట్ చేస్తున్నామని, మవద్ద ఉన్న అంబులెన్స్లు తక్కువ సంఖ్యలో ఉండడం వలన ఇబ్బందులు కలుగుతున్నాయని స్పష్టం ఎమ్మెల్యే కి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పేదల ఆరోగ్యానికి రక్షణలేదని పేర్కొన్నారు.రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అదనపు అంబులెన్స్లను గిరిజన ప్రాంతంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో ఘాట్ రోడ్లు ఉంటాయని తెలిసిన కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం చాలా బాధాకరమని తెలిపారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి గిరిజన ప్రాంతంలో నూతన అంబులెన్స్లు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేసిన అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం. ఇందులో సాగర ఎంపీటీసీ మరియు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వంతల దేవదాసు వైద్యులు తదితరులు ఉన్నారు.

# మద్యం మత్తులో రేషన్ డీలర్ కుటుంబంపై దాడి
### నిందితుడిపై కేసు నమోదు





**నక్కపల్లి, జూన్ 3, (ప్రజా ప్రతిభ) :**



నక్కపల్లి మండలం పెద్దతీనార్ల గ్రామంలో మద్యం మత్తులో ఓ యువకుడు రేషన్ డీలర్ కుటుంబంపై దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి: పెద్దతీనార్ల గ్రామానికి చెందిన రేషన్ డిపో డీలర్ గరికిని వెంకటరమణకు చెందిన కొబ్బరి తోటలో తరచూ కొబ్బరికాయల చోరీ జరుగుతోంది. ఈ క్రమంలో తోట సమీపంలో నివాసం ఉంటున్న మైలపల్లి వరహాలమ్మను వెంకటరమణ భార్య ప్రశ్నించగా, తనకు తెలియదని ఆమె బదులిచ్చింది. అనంతరం ఇరువురూ తమ ఇళ్లకు వెళ్లిపోయారు.అయితే అదే రోజు రాత్రి సుమారు 7 గంటల సమయంలో వరహాలమ్మ కుమారుడు మైలపల్లి గిరీష్ మద్యం మత్తులో వెంకటరమణ ఇంటికి వచ్చి దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి దిగాడు. ఇంట్లో ఉన్న వెంకటరమణ, ఆయన భార్య, కుమార్తెలపై దాడి చేసినట్లు బాధిత కుటుంబం ఆరోపించింది.ఈ ఘటనపై మే 30న బాధిత కుటుంబ సభ్యులు నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు విచారణ జరిపి, జూన్ 2న నిందితుడు గిరీష్‌పై సెక్షన్లు 329(4), 79, 115(2), 351(3) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ఉందని పోలీసులు తెలిపారు.

# ప్రజలతో మమేకమవుతున్న ఎస్డిపిఐ

### భవిష్యత్తు మనదే అంటూ ప్రజలతో ముందుకు సాగుతున్న సభ్యత్వ నమోదు
### భయం నుండి స్వేచ్ఛకై.. ఎస్డిపిఐ లో చేరండి : ఎస్డిపిఐ జిల్లా సభ్యులు అబ్దుర్రహ్మాన్

**నందికొట్కూరు, జూన్ 03 (ప్రజా ప్రతిభ):**

ఆకలి నుండి స్వేచ్ఛ... భయం నుండి స్వేచ్ఛను ఆకాంక్షిస్తున్న వారు సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియాలో చేరాలని ఎస్డిపిఐ జిల్లా కమిటీ సభ్యులు అబ్దుర్రహ్మాన్ పిలుపునిచ్చారు. బుధవారం సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నందికొట్కూరు అసెంబ్లీ అధ్యక్షులు ఖలీల్ ఆధ్వర్యంలో "భవిష్యత్తు మనదే" కార్యక్రమంలో భాగంగా 2,5,7,8,24 వార్డులలో సభ్యత్వకు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుర్రహ్మాన్ మాట్లాడుతూ దేశంలో సిద్ధాంతపరంగా బలమైన మరియు ప్రజల హక్కుల కోసం పోరాడే ఉత్తమ పార్టీ ఎస్డిపిఐ అని అన్నారు. అటువంటి పార్టీ కోసం పని చేయడం గౌరవకరమైన విషయం అని తెలిపారు. జూన్ నెల చివరి వరకు కొనసాగనున్న ఎస్డిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున యువతను మరియు ప్రజలను పార్టీ సభ్యులుగా చేర్చుకోనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా అసెంబ్లీ ప్రధాన కార్యదర్శులు అన్వర్, ఆరిఫ్, ఉస్మాన్ బాషా, రఫీ, అబ్దుల్లా, ఇమ్రాన్, బషీర్ ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# స్వచ్ఛపథం తోనే గ్రామాల పరిశుభ్రం



**నాతవరం, జూన్, 03,(ప్రజా ప్రతిభ)**

మండలంలోని మాధవనగరం గ్రామంలో బుధవారం స్వచ్ఛపథం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన రహదారుల ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు కాలువలను శుభ్రం చేశారు. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎంఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పంచాయతీ సిబ్బందికి అందించాలని సూచించారు. పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.కళ్యాణ్ కృష్ణ, మాజీ ఎంపీటీసీ శివలంక మారిణేశ్వరరావు,టిడిపి నాయకులు గంటా శ్రీను, తెలుగు యువత ఉపాధ్యక్షులు కశింకోట గోవిందరావు జనసేన నాయకుడు గుడివాడ కృష్ణ,మహిళా నాయకులు కూనిశెట్టి భారతి, సోముల మంగ, వైసిపి నాయకులు సిద్దాబత్తుల రమణతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# కన్నకొడుకు అంత్యక్రియలకు

## నిందితుడికి అనుమతి

## మానవత్వాన్ని చాటుకున్న అనకాపల్లి జిల్లా పోలీసులు



**మాడుగుల, జూన్ 3 ప్రజా ప్రతిభ:**

చట్టాన్ని అమలు చేయడంలో కఠినంగా వ్యవహరించే పోలీసు శాఖ, అవసరమైన సమయంలో మానవత్వాన్ని చాటుకుంటూ ప్రశంసలు అందుకుంటోంది. పిట్ ఎన్టీపీఎస్ చట్టం కింద విశాఖ సెంట్రల్ జైలులో ఉన్న నిందితుడు పెచ్చేటి రాజు (అలియాస్ మహాలక్ష్మి నాయుడు)కు తన కుమారుడి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఒకరోజు తాత్కాలిక విడుదల కల్పించడంలో అనకాపల్లి జిల్లా పోలీసు యంత్రాంగం కీలక పాత్ర పోషించింది. మాడుగుల మండలం జంపైన గ్రామానికి చెందిన పెచ్చేటి రాజు గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడిగా ఉండి, ఈ ఏడాది జనవరి 12న పిట్ ఎన్‌ఎపీఎస్ చట్టం కింద అరెస్టై విశాఖపట్నం సెంట్రల్ జైలులో ఉన్నాడు. ఇదిలా ఉండగా, గత మే 31న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆయన పెద్ద కుమారుడు పెచ్చేటి సాయి కిరణ్ (17) మృతి చెందాడు. ఇప్పటికే మూడు సంవత్సరాల క్రితం చిన్న కుమారుడు జితేంద్రను కోల్పోయిన కుటుంబం మరో విషాదాన్ని ఎదుర్కొంది. కుమారుడి అంత్యక్రియలకు తండ్రిని హాజరు పరచాలని కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాను ఆశ్రయించారు. కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకున్న ఎస్పీ వెంటనే స్పందించి రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. దీంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యవసరంగా ఉత్తర్వులు జారీ చేసి, పెచ్చేది రాజుకు ఒకరోజు తాత్కాలిక విడుదలకు అనుమతి మంజూరు చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పోలీసుల భద్రత నడుమ బుధవారం జంపెన గ్రామానికి చేరుకున్న పెచ్చేటి రాజు, తన కుమారుడు సాయి కిరణ్ పిండప్రదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు. భార్య లక్ష్మి, గ్రామస్తులు ఎస్పీ తుహిన్ సిన్హా, అదనపు ఎస్పీ ఎల్. మోహనరావుతో పాటు పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్ రాయవరం మండలం

# రేవుపోలవరం తీర ప్రాంతానికి తాగునీటి సౌకర్యం

## రూ.2 లక్షలతో బోరు, ట్యాంక్ పనులు ప్రారంభం



**ఎస్ రాయవరం, జూన్ 3, (ప్రజా ప్రతిభ) :**

ఎస్ రాయవరం మండలం రేవుపోలవరం సముద్ర తీర ప్రాంత ప్రజల తాగునీటి సమస్యను తీర్చేందుకు మండల పరిషత్ నిధులతో చేపట్టిన మోటారు బోరు, వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు.సుమారు రూ.2 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పనులకు మండల తెలుగు యువత అధ్యక్షులు కోడ లోవరాజు, మాజీ సర్పంచ్ కొవిరి బంగారి, నాయకులు మైలపల్లి అప్పలరాజు, బొంది బన్ని తదితరులు భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సముద్ర తీరానికి సమీపంలో ఉన్న రేవుపోలవరం గ్రామంలో దీర్ఘకాలంగా తాగునీటి ఎద్దడి నెలకొందని, మండల పరిషత్ నిధులతో మంజూరైన ఈ బోరు, ట్యాంక్ నిర్మాణంతో స్థానికులకు మేలు జరుగుతుందని తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పార్టీని, ప్రభుత్వాన్ని ప్రజలకు మరింతగా చేరువ చేస్తాం

**కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం గురించి ప్రతి గడపకు వెళ్లి వివరించాలి**

**ప్రతి బుధవారం యూనిట్, డివిజన్, నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు**

**యూనిట్ ఇంచార్జ్ కళాకార్, సొసైటీ చైర్మన్ ముర్తుజావలి, టీడీపీ పట్టణ కన్వీనర్ భాస్కర్ రెడ్డి**






**నందికొట్కూరు, జూన్ 03, (ప్రజా ప్రతిభ):**

తెలుగుదేశం పార్టీని, కూటమి ప్రభుత్వాన్ని ప్రజలకు మరింతగా చేరువ చేసేందుకు పటిష్టమైన ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నామని తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇంచార్జ్ కళాకార్ తెలిపారు. బుధవారం పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో క్లస్టర్స్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ ఇంచార్జ్ కళాకార్, సహకార సొసైటీ చైర్మన్ ముర్తుజావలి, తెలుగుదేశం పార్టీ పట్టణ కన్వీనర్ భాస్కర్ రెడ్డిలు మాట్లాడుతూ.. హైబ్రిడ్ విధానంలో జరిగిన మహానాడులో క్లస్టర్స్ స్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు లక్షల సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా మహానాడును వీక్షించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడంతో పాటు టెక్నాలజీపై అవగాహన పెంచుకున్నారని చెప్పారు. హైబ్రిడ్ మహానాడు కొనసాగింపుగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర కమిటీ ప్రత్యేక పార్టీ ప్రణాళికను విడుదల చేసిందన్నారు. అందులో భాగంగా ప్రతి నెల మొదటి బుధవారం యూనిట్ కన్వీనర్ పరిధిలోని ఐదు బూత్ కమిటీల సభ్యులు సమావేశమై స్థానిక సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయాలని సూచించారు. రెండో బుధవారం డివిజన్ స్థాయిలో, మూడో బుధవారం నియోజకవర్గ స్థాయిలో, నాలుగో బుధవారం పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. ఈ సమావేశాల ద్వారా స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించడంతో పాటు, పార్టీని మరింత పటిష్టం చేసుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి కూడా ఈ విధానం ఉపయోగపడుతుందని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని, ఆ దిశగా తెలుగుదేశం పార్టీ నంద్యాల పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్త జయసూర్య చర్యలు చేపట్టారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ మద్దిలేటి, మోహన్ రెడ్డి 15వ వార్డు ఇంచార్జ్ గోవర్ధనగిరి, 80వ బూత్ ఇంచార్జ్ నిమ్మకాయల మోహన్, 81వ బూత్ ఇంచార్జ్ రాజ్ కుమార్ (సన్నీ), 82వ బూత్ ఇంచార్జ్ జయన్న, 83వ బూత్ ఇంచార్జ్ అయ్యరాజు, తెలుగుదేశం పార్టీ యూత్ లీడర్ గని, నవీన్, సమీ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి..

**ప్రజలకు సమయానికి అందుబాటులో ఉండాలి**

**సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయాలి**

**ప్రజలపట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలి**

**ప్రజలకు సకాలంలో, నాణ్యమైన సేవలు అందించాలి**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**



**నంద్యాల బ్యూరో జూన్ 03, ప్రజా ప్రతిభ :**



నంద్యాల జిల్లాలో ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగవంతంగా అందేలా సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. బుధవారం నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామ సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా సచివాలయంలో నిర్వహిస్తున్న వివిధ సేవలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా గ్రామ ప్రజల అభిప్రాయాలు (పర్సెప్షన్), రీ-సర్వే ప్రక్రియ పురోగతి, పట్టాదార్ పాస్‌బుక్‌ల పంపిణీ స్థితి వంటి అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది హాజరు వివరాలతో పాటు సంబంధిత శాఖల రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు అందించే సేవల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సచివాలయానికి వచ్చే ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి వారి సమస్యలను ఓర్పుతో వినాలని సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, వారి అవసరాలను గుర్తించి సేవలను సమర్థవంతంగా అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు సంబంధించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, నాణ్యతతో సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రజలకు చేరువగా ఉండాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## అవినీతికి పాల్పడుతున్న

# వారిపై చర్యలు తీసుకోవాలి

**మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంపై అవినీతి ఆరోపణలు**

**కలెక్టర్ రాజకుమారి గణియాకు ఫిర్యాదు చేసిన ఏవీఎస్, ఏఐఎఫ్డిఎస్ విద్యార్థి సంఘాలు**




**నందికొట్కూరు, జూన్ 03, (ప్రజా ప్రతిభ):**

మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల నుంచి డబ్బు, వస్తువులు డిమాండ్ చేస్తున్నారని ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.నాగరాజు, అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య నాయకులు అశోక్ కుమార్ జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియాకు ఫిర్యాదు చేశారు. బుధవారం స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహానికి వచ్చిన జిల్లా పాలనాధికారిని ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. నాగరాజు, అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య నందికొట్కూరు అధ్యక్షుడు అశోక్ కుమార్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏవీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ మండల విద్యాశాఖ కార్యాలయంలో కొందరు ఉద్యోగులు ప్రైవేటు పాఠశాలలతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాత కాగితం నుంచి నగదు వరకు కార్యాలయ సిబ్బంది డిమాండ్ చేస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే “వారు మానవతా దృక్పథంతో ఇస్తున్నారు” అని కార్యాలయ సహాయకుడు సమాధానం చెబుతున్నారని తెలిపారు. కార్యాలయంలో కూర్చోవడానికి విలాసవంతమైన బల్లలు, కుర్చీలు, పెద్ద సంస్థల స్థాయి గణన యంత్రాలు కావాలంటూ ప్రైవేటు విద్యాసంస్థలను అడగడం సిగ్గుచేటని విద్యార్థి సంఘాల నేతలు మండిపడ్డారు. కార్యాలయంలో కొత్తగా పెద్ద తెర గల గణన యంత్రాలు కనిపిస్తున్నాయని, అవి ఏ నిధులతో కొనుగోలు చేశారో, పాత పరికరాలు ఎక్కడికి వెళ్లాయో, సరుకు పట్టికలో నమోదు ఉందో లేదో పరిశీలించాలని కోరారు. ప్రైవేటు పాఠశాలల తనిఖీల సమయంలో నిబంధనలు పాటించకపోయినా “మాకు ముట్టజెప్పండి.. మేము చూసుకుంటాం” అంటూ డబ్బుకు బేరం ఆడుతున్నారని వారు ఆరోపించారు. రాత్రి వేళల్లో కూడా మండల విద్యాశాఖ కార్యాలయం తెరిచి ఉండటంపై అనుమానం వ్యక్తం చేశారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయుల నుంచి కూడా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు వస్తున్నాయని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కార్యాలయంలో నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలని, పూర్తికాలం మండల విద్యాశాఖ అధికారిని నియమించాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 1, 56 ప్రకారం కనీస వసతులు లేని పాఠశాలలకు ఎలా అనుమతులు ఇస్తున్నారో పరిశీలించాలని అన్నారు. విద్యార్థులకు న్యాయం చేయాల్సిన అధికారులే “విద్యార్థుల కష్టాలు మాకొద్దు.. ప్రైవేటు అనుబంధం మాకు ముద్దు” అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని విద్యార్థి సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా విజేతలకు సైకిళ్ల బహూకరణ.

**సైక్లింగ్‌తో ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ సాధ్యం: రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు**

**విశాఖ బ్యూరో సత్య, జూన్ 3( ప్రజా ప్రతిభ ):**

ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైకిల్ వినియోగం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు శారీరక దృఢత్వం, ఆరోగ్యకరమైన జీవనశైలి సాధ్యమవుతుందని రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు పేర్కొన్నారు. రైల్వే శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపులో రన్నింగ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి విశేష ప్రతిభ కనబరిచిన విశాఖపట్నం అదనపు జిల్లా న్యాయస్థానాల ప్రభుత్వ న్యాయవాది కన్నూరు అప్పలనాయుడు కుమారులను అభినందిస్తూ ఆయన చేతుల మీదుగా సైకిళ్లను బహూకరించారు.ఈ సందర్భంగా పి.ఎస్. నాయుడు మాట్లాడుతూ నేటి యువత మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు మాత్రమే పరిమితం కాకుండా క్రీడలు, వ్యాయామం, సైక్లింగ్ వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను అలవరుచుకోవాలని సూచించారు. సైకిల్ వినియోగం వల్ల గుండె సంబంధిత వ్యాధులు, ఊబకాయం వంటి ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు.అదేవిధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించి ఇంధన పొదుపుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. యువత క్రీడల్లో రాణిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని ఆకాంక్షించారు.



# 'వెన్నుపోటుకు రెండేళ్లు' పోస్టర్ల ఆవిష్కరణ

**జూన్ 4 నుండి 12 వరకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాలు**

**"వెన్నుపోటుకు రెండేళ్లు"ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మన్సూర్ అహ్మద్**




నందికొట్కూరు, జూన్ 03, (ప్రజా ప్రతిభ):

చంద్రబాబు " వెన్నుపోటుకు రెండేళ్లు " పూర్తయ్యాయని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మన్సూర్ అహ్మద్ విమర్శించారు. తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిందని ఆరోపిస్తూ వైయస్ఆర్సీపీ ఆధ్వర్యంలో "వెన్నుపోటుకు రెండేళ్లు పోస్టర్‌ను పట్టణంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మన్సూర్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని, సంక్షేమ పథకాల అమలులో అనేక లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తూ వైయస్ఆర్సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. 'బాబూ ష్యూరిటీ, మోసం గ్యారెంటీ' అనే నినాదాన్ని నిజం చేసి, ఆరు కోట్ల మంది ప్రజలను మోసం చేశారని విమర్శించారు అధికారంలోకి వచ్చాక 18 ఏళ్లు నిండిన మహిళలకు ఇస్తామన్న ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయకుండా ప్రతి మహిళకు రూ.36వేలు, నిరుద్యోగులకు 20లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా ఒక్కో నిరుద్యోగికి రూ.72వేలు, 50 ఏళ్లకే పింఛన్ ఇవ్వకుండా ఒక్కొక్కరికి రూ.96వేలు, అన్నదాత సుఖీభవ ద్వారా ఒక్కో రైతుకు రూ.26వేలు బకాయి పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 6.23లక్షల పింఛన్లు కోత కోశారని, ప్రతినెలా 25వేల పింఛన్లు తీసేస్తున్నారని ధ్వజమెత్తారు. ఉచిత బస్సు అని కేవలం ఐదు సర్వీసుల్లోనే అమలు చేస్తున్నారని, మొత్తం ఆర్టీసీనే ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మెగా డీఎస్సీ పేరుతో దగా చేశారన్నారు. ఈ ప్రభు త్వం రెండేళ్లలో ప్రజలకు చేసిన మోసాలపై 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళు ' పేరుతో ఈనెల 4వ తేది మండల కేంద్రాల కూడళ్లలో టీడీపీ మేనిఫెస్టో కాపీలను, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సంతకాలతో కూడిన బాండ్లను దహనం చేస్తామన్నారు. 8,9 తేదీలలో నియోజకవర్గ కేంద్రాల సదస్సులు నిర్వహిస్తామని, 12న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించి అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తామని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మన్సూర్ వివరించారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధురి గౌడ్, విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షులు అబ్దుల్లా, మాజీ కౌన్సిలర్ అల్లూరి కృష్ణ, రైతు సంఘం నాయకులు బాబు, సతీష్ రెడ్డి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ఆయిల్ షఫీ, హషమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ భారత మహిళా
# సమాఖ్య 72వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**మహిళల హక్కుల సాధనకు ఐక్యతే బలం: వరకా శ్యామల**

**మహిళా రిజర్వేషన్ చట్టాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని డిమాండ్**



కుక్కునూరు, జూన్ 03 (ప్రజా ప్రతిభ):

కుక్కునూరు మండలంలో జాతీయ భారత మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) 72వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ, రాష్ట్ర మహిళా సమాఖ్య పిలుపు మేరకు ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల ఆధ్వర్యంలో మండలంలోని సీతారామనగరం, బోనగిరి గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు.సీతారామనగరంలో కాకాని తిరుపతమ్మ, బోనగిరిలో ఊకే సరోజని అధ్యక్షతన జరిగిన వేడుకల్లో జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం వరకా శ్యామల మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు.




మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కుల సాధన కోసం జాతీయ భారత మహిళా సమాఖ్య గత ఏడు దశాబ్దాలుగా నిరంతర పోరాటం చేస్తోందని ఆమె పేర్కొన్నారు. నేటికీ మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్న నేపథ్యంలో వాటిని ఎదుర్కొనేందుకు మహిళలందరూ ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు.మహిళా రిజర్వేషన్ చట్టాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. మహిళలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం లభిస్తేనే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని, దేశాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని పేర్కొన్నారు.అదేవిధంగా మహిళలకు విద్య, ఉపాధి, ఆరోగ్యం, భద్రత రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో ఇరపా రాణి, సోయం శ్యామల, ఇరపా తిరుపతమ్మ, గుండి యాదమ్మ, గంగాధరి, వరలక్ష్మి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు రైతులకు కూటమి ప్రభుత్వం
# అన్ని విధాలా అండగా ఉంటుంది: ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

**మునికూడలి గ్రామంలో పర్యటించి, కార్మికులతో కలిసి కూర్చుని**

**పొగాకు గ్రేడింగ్‌ను పరిశీలించిన శాసనసభ్యులు.**



సీతానగరం జూన్ 03 (ప్రజా ప్రతిభ)

రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ బత్తుల బలరామకృష్ణ గారు సీతానగరం మండలం మునికూడలి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన గ్రామంలోని పొగాకు ఉత్పత్తి కేంద్రానికి వెళ్లి, స్థానిక పొగాకు రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీ బత్తుల బలరామకృష్ణ గారు మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం, పొగాకు రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే శ్రీ బత్తుల బలరామకృష్ణ గారు పొగాకు ఉత్పత్తి కేంద్రంలో పనిచేస్తున్న కార్మికుల వద్దకు వెళ్లారు. సాధారణ ప్రజాప్రతినిధిలా కాకుండా, ఆ కార్మికులతో పాటే నేలపై కూర్చుని వారు పొగాకు గ్రేడింగ్ (రకాలు వేరు చేయడం) చేస్తున్న విధానాన్ని నేరుగా, క్షుణ్ణంగా పరిశీలించారు. పొగాకులోని రకాలు, నాణ్యత ప్రమాణాల గురించి కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం



ఎండలు తీవ్రంగా ఉన్నందున, పనిచేసే ప్రదేశాలలో కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే గారు సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరికీ తాగునీరు, మజ్జిగ అందుబాటులో ఉంచాలని కేంద్ర నిర్వాహకులకు ఆదేశించారు. కార్మికుల ఆరోగ్యం అత్యంత ముఖ్యం అని ఆయన పేర్కొన్నారు.ఈ పర్యటన కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో
# విత్తన గుళికల జల్లిన పొలాలను పరిశీలించన

**హేమ సుందర్**

గోకవరం జూన్ 03 (ప్రజా ప్రతిభ)

గోకవరం మండలం కొత్తపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వెదజల్లిన విత్తన గుళికలు జల్లిన పొలాలను పరిశీలించన రీజ నల్ టేమేటిక్ లీడ్ హేమ సుందర్, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ తాతారావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు, మండల సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.
జిల్లాలో వరి సాగుతో అపరాలు, వరి సాగుతో మొక్కజొన్న, వరి సాగుతో వరి, ఈ మూడు పద్ధతుల్లో రైతులు పాటిస్తున్నారు కానీ తరువాత పొలాలు ఖాళీగా ఉంచకుండా కోతులు మరియు పశువులు పాడుచేయని పంటలైన జీలుగా నువ్వులు, ఆముదం, నీలి విత్తనాలు గోంగూర వేసుకొని భూమిని కప్పి ఉంచాలని హేమ సుందర్ తెలియజేశారు. ఈ పద్ధతిలో పాటించడం వల్ల 365 రోజులు భూమి కప్పి ఉంటుందని అలాగే కలియ దున్నుకుంటే పచ్చి రొట్ట భూములో కలుస్తుందని. గోంగూర వల్ల అదనపు ఆదాయం వస్తుందని చెప్పడం జరిగింది.డిపిఎం తాతారావు మాట్లాడుతూ క్యాడర్ అందరూ ఎవరు పనిచేస్తున్న గ్రామాలకి వాళ్లు దేశీ వెరైటీలు ప్రమోట్ చేయాలని అలాగే రైతులకు అందుబాటులో కషాయాలు మరియు ద్రావణాలు గ్రోత్ ప్రమోటర్స్ మరియు గోల్డెన్ బయో లెట్టర్, బయో చార్ ఘణ, ద్రవజీవామృతాలు అందుబాటులో ఉంచాలని రైతులందరినీ కూడా విత్తనం వేసిన దగ్గర నుండి పంట కోత వరకు మారే విధంగా మన ప్రణాళిక ఉండాలని కేడర్స్ అందరికి చెప్పడం జరిగింది. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో విత్తన గుళికలు వేసిన బ్లాక్ లను పరిశీలించడం జరిగింది విత్తన గుళికలు తయారు చేసి వేయాలని ప్రతి రైతు ఈ విధానాన్ని అనుసరించి తమ పొలాల్లో విత్తన గుళికలను వినియోగించాలని కోరారు.గోల్డెన్ బయోలెట్టరు తయారీ మరియు ఉపయోగాల గురించి కేడర్ అందరికీ తెలియజేయడం జరిగింది. అందరూ కూడా ఒక్కొక్కరు 20 మందితో ఈ గోల్డెన్ బయో లీట్టర్ తయారు చేయాలని చెప్పడం జరిగింది.







ఈ కార్యక్రమంలో ఎఫ్ఎమ్‌టీలు, ఐసీఆర్పీలు, టీ ఐసిఆర్పి లు పాల్గొన్నారు.

## ఎల్.కోట మండలంలో
# సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

**విద్యుత్ శాఖ మంత్రికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి వినతి**

శృంగవరపుకోట జూన్ 3.(ప్రజాప్రతిభ- ఎం.రమణ )

ఎస్.కోట నియోజకవర్గం ఎల్.కోట మండలం రెల్లి గవీరమ్మ పేట (ఆర్.జి పేట) పరిధిలో ఎదురవుతున్న విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలంటూ నియోజకవర్గ శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ని కోరారు. విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలసిన ఎమ్మెల్యే దంపతులు వారిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్.జి పేట వద్ద 133/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, తద్వారా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న లో-వోల్టేజీ, విద్యుత్ అంతరాయాల కష్టాలను తీర్చాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ .. స్థానిక ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలోనే ఈ సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని, సబ్ స్టేషన్ ఏర్పాటుకు సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ట్రాఫిక్ రూల్స్ ను ప్రజలందరూ తప్పనిసరిగా
# పాటించాలని కొత్తవలస పోలీస్ వారు లౌడ్ స్పీకర్స్ ద్వారా హెచ్చరిక..

**సి.ఐ. టీవీ విజయకుమార్**






శృంగవరపుకోట జూన్ 3 (ప్రజాప్రతిభ- ఎం. రమణ )

కొత్తవలస పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ టీవీ విజయకుమార్ కొత్తవలస జంక్షన్లో ట్రాఫిక్ రద్దీ దృశ్య ప్రతిరోజు ట్రాఫిక్ సిబ్బంది ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా కొత్తవలస జంక్షన్ లో వాహనదారులకు సూచనలు చేయుట నిమిత్తం, అలాగే మహిళల భద్రతా సైబర్ నేరాల నిమిత్తం, దొంగతనాల జరక్కుండా సూచనలు అవగాహన కల్పించడానికి కొత్తవలస జంక్షన్లో ఒక మెగా యాప్ల వైర్ ను విజయనగరం రోడ్డు ఎస్.కోట రోడ్డు విశాఖపట్నం రోడ్డులో లౌడ్ స్పీకర్లను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన, ట్రాఫిక్ సూచన చేయుటకు ఏర్పాటు చేయించడం జరిగింది కావున ప్రజలు ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ పోలీసు వారు సూచనలను పాటించాలని కొత్తవలస పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ టీవీ విజయ్ కుమార్ పత్రిక ముఖంగా తెలియజేయడం జరిగింది

## డాక్టర్ అంజి నాయక్ పుట్టినరోజు
# సందర్భంగా భోజనం ప్యాకెట్లు అందజేత



ప్రత్తిపాడు /తుని, జూన్03 (ప్రజా ప్రతిభ) :

ప్రత్తిపాడు దేవర్ష్ హాస్పిటల్ ఇంచార్జ్ డాక్టర్ అంజి నాయక్ జన్మదినం సందర్భంగా ఆయన సతీమణి డాక్టర్ విజయ,కుటుంబ సభ్యుల సహకారంతో బుధవారం సేవా కార్యక్రమం నిర్వహించారు.ఏలేశ్వరం బ్రాహ్మణ భోజనం హోటల్ బేత శ్రీనివాస్,దోనేపూడి శ్రీను,పొన్నగంటి సత్తిబాబు సహకారంతో ఏలేశ్వరం బాలాజీ చౌక్ సెంటర్లో వివేకానంద సేవా సమితి అధ్యక్షులు మైర్యాల నాగేశ్వరరావు, సభ్యులు ఆధ్వర్యంలో సుమారు 100 మందికి భోజన పొట్లాలు మరియు టవల్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాల రూపంలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి సభ్యులు పెండ్యాల రాజు,మల్లి బాబు,రాజబాబు,దాసరి కృష్ణ,రాజశేఖర్,పిరట్ల రవి,గొల్లపూడి త్రిమూర్తులు,జగన్,కంచర్ల రమేష్,డోర్స్ రమేష్,మెడికల్ షాప్ లక్ష్మణ్,బ్లడ్ టెస్ట్ గణేష్,నీలి పాండురంగ,హరీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# గంగంపాలెం ఎంపీపీ స్కూల్ విద్యార్థి

**ఏపీ రెసిడెన్సీయల్ స్కూల్ మరియు అంబేద్కర్ గురుకుల పాఠశాలకు సెలెక్ట్**

గోకవరం జూన్ 03 (ప్రజా ప్రతిభ)

గోకవరం మండలం గంగపాలెం గ్రామ ఎంపీపీ యూపీ స్కూల్ విద్యార్థి మొల్లేటి వరుణ్ తేజ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ మరియు అంబేద్కర్ గురుకుల పాఠశాలలకు విడివిడిగా నిర్వహించిన అర్హత పరీక్ష నందు మంచి మార్కులు సాధించి స్టేట్ 80 ర్యాంకు తెచ్చుకుని రెండు గురుకుల పాఠశాలలో (తుని, గుంటూరు) సీటు సాధించడం జరిగింది. తమ పాఠశాలకు చెందిన విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచి సీట్ సాధించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ములపర్తి హరి ప్రసాద్ క్లాస్ టీచర్ దివ్య పాఠశాల ఉపధ్యాయులును మరియు తల్లిదండ్రులును గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు అభినందనలు తెలియజేశారు మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నారు



# పరిసరాలు పరిశుభ్రంగా ఉన్ననాడే ఆరోగ్యవంతమైన జీవితం




**ప్రత్తిపాడు/తుని, జూన్ 03 (ప్రజా ప్రతిభ) :**

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకున్నాడే ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని కాకినాడ జిల్లా ఎంపీపీల సమాఖ్య అధ్యక్షుడు, ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) పిలుపునిచ్చారు. మలేరియా వ్యతిరేక మాస ఉత్సవాల సందర్భంగా మండలంలోని జే అన్నవరం గ్రామంలో మలేరియా వ్యతిరేక మహోత్సవ ర్యాలీని ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ గొల్లపల్లి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి మలేరియా వ్యాధిపై అవగాహన కలిగి ఉన్నాడే ఆ వ్యాధి బారిన పడకుండా నివారించుకోవచ్చు అన్నారు. అనంతరం అయినా గ్రామ ప్రజలతో ర్యాలీగా గ్రామాలలో నూతనంగా నిర్మిస్తున్న ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గం శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ ఆదేశాలతో ఆరోగ్య కేంద్రం తొందరలోనే ప్రారంభానికి సిద్ధమవుతుందన్నారు. దీంతో ప్రజలు తమ ఆరోగ్య సమస్యలకు దూర ప్రాంతాలకు వెళ్లవలసిన అవసరం లేదన్నారు. జై అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు బి జయరాం మాట్లాడుతూ తమ పరిసరాల్లో దోమలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తద్వారా మలేరియా తదితర వ్యాధులకు దూరంగా ఉండవచ్చునారు. అనంతరం ఎంపీపీ గొల్లపల్లి గ్రామంలో స్వచ్ఛ రథం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# నేదురుమల్లి రాజ్యలక్ష్మి గిరిజన కాలనీలో సామూహిక శ్రీమంతాలు.





**గూడూరు చిల్లకూరు జూన్ 3. ప్రజా ప్రతిభ**

నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం కడివేడు పంచాయతీ పరిధిలోని నిధులు రాజ్యలక్ష్మి గిరిజన కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన ఎం వి రావు ఫౌండేషన్ నిర్వాహకులు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. గూడూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని నేదురుమల్లి రాజ్యలక్ష్మి గిరిజన కాలనీలో నమోదైన ఇద్దరు మహిళలు గర్భవతులై ఉన్నందున వారిని గుర్తించి వారికి ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీల మోహన్ కృష్ణ కార్యదర్శి ఎం విజయలక్ష్మి అంగన్వాడీ కేంద్రం సిబ్బంది గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో ఇద్దరు మహిళలకు సామూహిక శ్రీమంతం నిర్వహించారు. గర్భవతులైన ఇద్దరు మహిళలకు చీరలు పసుపు కుంకుమ గాజులు తో వారికి శ్రీమంతం నిర్వహించారు. అనంతరం వేసవిలో వడగాల్పులు తగలకుండా వారికి ఉపశమనం కలిగించే నిమిత్తం హోమియో మందులను కూడా కాలనీవాసులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలామోహన్ కృష్ణ కార్యదర్శి ఎం విజయలక్ష్మి అంగన్వాడి సిబ్బంది గర్భవతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వృద్ధ మహిళకు ఆర్థిక చేయూత



**వాకాడు జూన్ 3 ప్రజా ప్రతిభ**

తిరుపతి జిల్లా వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ పట్టాభిరామాలయంలో ప్రవాస భారతీయులు రామిరెడ్డి వేంకటరామిరెడ్డి హైమావతమ్మ లావణ్య మధుకిరణ్ రెడ్డి కుటుంబ సభ్యుల ఆర్థిక సౌజన్యంతో ఖమ్మం జిల్లాకు చెందిన పెగళ్ళపాటి పద్మావతి అనే మహిళకు 25 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఆలయ ధర్మకర్తలు,మాజీ సొసైటీ చైర్మన్ కొడవలూరు దామోదరరెడ్డి ఆన్లైన్ ద్వారా ఇరవైఐదు వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాలలో ఉన్నప్పటికీ స్వదేశంపై మమకారంతో ఆర్థిక ఇబ్బందులలో ఉన్న వాళ్లను ఆదుకోవాలనే సదుద్దేశ్యంతో తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన వృద్ధ మహిళకు ఆమె మనవరాలి వివాహం కోసం ఇరవైఐదు వేల రూపాయలను ఇవ్వడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా దాతలకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సంస్థ ప్రతినిధి దీవి అనంతాచార్యులు,శ్రీరామసేన అధ్యక్ష,కార్యదర్శులు కొడవలూరు హరీష్ రెడ్డి పోలిపాటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు వెన్నుపోటుకు

# రెండేళ్లు పోస్టర్ల ఆవిష్కరణ...






**వెంకటగిరి, జూన్ 3(ప్రజా ప్రతిభ ):**

వెంకటగిరి పట్టణంలోని స్థానిక నేదురుమల్లి నివాసం వద్ద బుధవారం వెన్నుపోటుకు రెండేళు -- పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి అధ్యక్షత నాయకులు, కార్యకర్తల సమక్షంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రాంకుమార్ రెడ్డి విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని ఆరోపించారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గిస్తామన్న ఎన్నికల హామీని విస్మరించి నేడుధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం కారణంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల నుండే ప్రజలు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. అమరావతి పేరుతో అడ్డగోలుగా అప్పులు చేసి దేశంలో ఎక్కడా లేనివిధంగా రాజధాని లో భవనాల నిర్మాణం కోసం చదరపు అడుగు రూ. 12,000 నుండి రూ. 14,000 వరకు వెచ్చిస్తూ దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై వైఎస్ఆర్సిపి నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## బహుజన ఆత్మీయ సమ్మేళనాన్ని

# జయప్రదం చేసినందుకు ధన్యవాదాలు

**పలమనేరు జూన్ 3( ప్రజా ప్రతిభ )**





మే 31వ తేది ఆదివారం గంగవరం ప్లే ఓవర్ వద్ద ఎస్. ఫంక్షన్ హాల్ నందు జరిగిన బహుజన ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేసిన నియోజకవర్గ ప్రజలకు హైకోర్టు న్యాయవాది, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు చింతమాకుల, పుణ్యమూర్తి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. అందులో భాగంగా బుధవారం బహుజన నాయకులు డి.వి .మునిరత్నం అధ్యక్షతన ఎస్. ఫంక్షన్ హాల్ నందు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది పుణ్యమూర్తి మాట్లాడుతూ గత నెల రోజులుగా పలమనేరు నియోజకవర్గంలో ఎస్సీ ,ఎస్టీ ,బీసీ ,మైనార్టీ కాలనీలను సందర్శించామని ఆ సందర్భంలో బహుజనులు నిత్యం అనుభవిస్తున్న కష్టాలను కళ్లారా చూసామని పేర్కొన్నారు. ఎన్నికలప్పుడు నాయకులు కల్ల బొల్లి మాటలు చెప్పి ఓట్లు గుంజుకుని గద్దెనెక్కిన తర్వాత బహుజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేశారనే విషయం తేట తెల్లమైందన్నారు. ఈ విషయాలను తెలుసుకోవడానికి బహుజన రాజ్యాధికార ఉద్యమాన్ని చేపడుతున్నామని గుర్తు చేశారు. తాము చేస్తున్న ఉద్యమంలో భాగంగా ప్రజలకు రాజ్యాంగం, చట్టాలు ,హక్కులు, నిరుద్యోగ సమస్యలు పరిష్కారానికి చేయాల్సిన కృషి స్పష్టంగా వివరిస్తూ ప్రజలను, యువతను రాజ్యాంగ నిర్మాత జ్యోతిరావు పూలే, అంబేద్కర్, సాహు మహారాజన్, కాన్సిరాం కలలను సహకారం చేయడానికి చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామానికి వెళ్లే సందర్భంలో బహుజనులు హృదయాలు నుండి వచ్చిన అంశాలు రాజకీయ ప్రత్యామ్నాయం కోరుకుంటున్నారని గుర్తు చేశారు. నాంపల్లి శివాజీ, సరస్వతి, మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రభుత్వాలు మేలు చేస్తాయని గ్రహించిన ప్రజలు ఏమి చేయకపోవడంతో అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో బహుజనుల సమస్యలను గుర్తించి ప్రభుత్వం, అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించి నాణ్యమైన ప్రజాస్వామ్యం కోసం బహుజనులు రాజ్యాధికార దిశగా ప్రయాణిస్తామన్నారు . ఈ కార్యక్రమంలో సరస్వతి, జగదీశ్వరి, సాంబశివ, గుర్రం సుబ్రహ్మణ్యం అమానుల్లా, శాంతమ్మ, సావిత్రమ్మ,, శివయ్య, ఆనంద్, లక్ష్మీనారాయణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## పజలు పౌర హక్కుల పై అవగాహన

# కలిగి ఉన్నప్పుడే సమాజంలో మార్పు వస్తుంది.

### తహసీల్దారు చిట్టిబాబు.

### గుల్లేపల్లి దళితవాడలో పౌరహక్కుల దినోత్సవం.



**కుప్పం, జూన్ -3(ప్రజా ప్రతిభ):**

భారత రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు. ప్రజలు పౌర హక్కులపై అవగాహన కలిగి ఉన్నప్పుడే సమాజంలో మార్పు వస్తుందని తహసీల్దారు చిట్టిబాబు అన్నారు. బుధవారం కుప్పం మున్సిపాలిటీ గుల్లేపల్లి ఎస్సీ దళితవాడలో తహసీల్దారు చిట్టిబాబు అధ్యక్షతన పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమానత్వం, సమసమాజం స్థాపనకై రాజ్యాంగంలో పొందు పరిచిన వివిధ చట్టాలను ఉటంకిస్తూ రాజ్యాంగంలో పౌరహక్కులకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ కాలనీలో నెలకొన్న తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్యం తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షులు ఎంపీ ప్రకాష్ మాట్లాడుతూ, దళితవాడల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహించే పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమాలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని అన్నారు. అయితే పలువురు అధికారులు గైర్హాజరు కావడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, "దళితుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, ఎస్సై రామకృష్ణ, మున్సిపాలిటీ సూపర్వైజర్ సింగిల్ విండో డైరెక్టర్ అన్నాదొరై, ఎమ్మార్పీఎస్ కుప్పం మండల అధ్యక్షుడు రాజేష్, బోదుగుట్టపల్లి సురేష్, మండల స్థాయి అధికారులు, గ్రామస్తులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రపంచ సైకిల్ దినోత్సవం--2026 సందర్భంగా

# యువత, విద్యార్థులతో భారీ సైకిల్ ర్యాలీ

**కుప్పం,జూన్ 3(ప్రజా ప్రతిభ):**





ప్రపంచ సైకిల్ దినోత్సవం--2026 సందర్భంగా కుప్పంలో యువత, విద్యార్థుల భాగస్వామ్యంతో భారీ సైకిల్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కుప్పం డీఎస్పీ పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు, లయన్స్ క్లబ్ అడ్వైజర్ లయన్ ఎ. మహేష్ లు ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకర జీవనశైలి మరియు ఇంధన పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. ర్యాలీలో వందలాది మంది యువకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సైకిల్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని సైక్లిస్ట్ రాజు, శివ మరియు పలువురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు మాట్లాడుతూ, సైకిల్ వినియోగం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, కాలుష్య నియంత్రణకు కూడా ఇది ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. యువత ప్రతిరోజూ సైక్లింగ్‌ను అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ర్యాలీ విజయవంతం కావడానికి సహకరించిన పోలీసు శాఖ, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు స్వచ్ఛంద కార్యకర్తలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ ర్యాలీ కుప్పం పట్టణంలో విశేష ఆకర్షణగా నిలిచింది.

# కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం

**చేస్తున్న డీకే శివకుమార్ గారికి**
**హృదయపూర్వక శుభాకాంక్షలు!**
**తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ**
**మైనారిటీ అధ్యక్షులు షేక్ నాయకుల ఫయాజ్**




గూడూరు జూన్ 3 ప్రజా ప్రతిభ

నెల్లూరు జిల్లా గూడూరుకర్ణాటక రాష్ట్ర ప్రజల ఆశయాలను ప్రతిబింబిస్తూ, ప్రజాస్వామ్య విలువలకు అంకితభావంతో నిరంతరం ప్రజల మధ్య పనిచేస్తూ వచ్చిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డీకే శివకుమార్ గారు కర్ణాటక రాష్ట్ర 25వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న శుభసందర్భాన్ని పురస్కరించుకుని తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులు షేక్ నాయకుల ఫయాజ్ తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సాధారణ కార్యకర్త స్థాయి నుంచి ప్రజల అపార విశ్వాసాన్ని సంపాదించి, పార్టీ పట్ల తిరుగులేని నిబద్ధతతో, నిరంతరం కష్టపడే డైనమిక్ నాయకుడిగా దేశ రాజకీయాల్లోనే ఒక ప్రత్యేక గుర్తింపు పొందిన డీకే శివకుమార్ గారి నాయకత్వం నేటి యువతకు ఎంతో ఆదర్శంగా నిలుస్తోందని ఈ సందర్భంగా ఫయాజ్ కొనియాడారు. ఆయన రాజకీయ ప్రస్థానం ధైర్యం, సహనం, పట్టుదల, మరియు నిరంతర ప్రజాసేవ అనే ఉన్నత విలువలకు నిదర్శనమని పేర్కొంటూ, నూతన ముఖ్యమంత్రి పరిపాలనలో కర్ణాటక రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా సామాజిక న్యాయం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సంక్షేమం, రైతుల పురోగతి, యువతకు ఉపాధి కల్పన మరియు లౌకిక విలువల పరిరక్షణలో డీకే శివకుమార్ గారి నాయకత్వం సరికొత్త చరిత్ర సృష్టించాలని, ప్రపంచం మొత్తం ఆయన పరిపాలన దక్షత వైపు చూసేలా అడుగులు పడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులు షేక్ నాయకుల ఫయాజ్ ప్రకటించారు.

# పేదలకు సేవ చేయడమే సిఆర్ ఫౌండేషన్ లక్ష్యం

**చావా వాసుదేవ రావు దాతృత్వం అభినందనీయం**
**సిఆర్. ఫౌండేషన్ కు ఎకరా వితరణ**
**సిఆర్. ఫౌండేషన్ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, డాక్టర్ కె. నారాయణ వెల్లడి**

గూడూరు జూన్ 3 ప్రజా ప్రతిభ




నెల్లూరు జిల్లాచిల్లకూరు మండల పరిధిలోని పారిచేర్ల వారి పాలెంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త చావా వాసుదేవ రావుకి చెందిన ఎకరా భూమిని బుధవారం గూడూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సిఆర్ ఫౌండేషన్ కు రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా సిఆర్. ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె. నారాయణ మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా సీఆర్. ఫౌండేషన్ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాదులో ఉన్న ఓల్డ్ ఏజ్ హోమ్ దేశంలోనే అత్యంత పేరు ప్రతిష్టలు సంపాదించి 150 మంది సీనియర్ సిటిజన్లకు ఆసరాగా ఉందన్నారు. సిఆర్. ఫౌండేషన్ తరపున ఒక మహిళ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, సీఆర్. పాలి క్లినిక్, ఎన్ఆర్ఆర్ రీసెర్చ్ సెంటర్, విశాలమైన గ్రంథాలయం, తదితర కార్యకలాపాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే గుంటూరులో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో సీఆర్. ఫౌండేషన్ పేరుతో ఓల్డ్ ఏజ్ హోమ్, అనాధ పిల్లల ఆశ్రమం నిర్మించనున్నట్లు తెలిపారు. కడపలో మూడు ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఆశ్రమాన్ని వచ్చే నెల ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గూడూరులో చావా వాసుదేవరావు దాతృత్వంలో వారి సతీమణి, కుమారుడు చావా హర్షవర్ధన్ పేరుతో సీఆర్. ఫౌండేషన్ కు అనుబంధంగా ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కే.నారాయణ, ముప్పాళ్ళ నాగేశ్వరరావు వాసుదేవరావు, ఆయన కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ. రామానాయుడు,బీకేఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్. ప్రభాకర్, చావా వాసుదేవ రావు, ఆయన కుమారుడు చావా హర్షవర్ధన్,అమరావతి హాస్పిటల్ అధినేతలు డాక్టర్ రమణయ్య, డాక్టర్ నిర్మల, సీపీఐ గూడూరు నియోజకవర్గ కార్యదర్శి జి. శశికుమార్, పట్టణ కన్వీనర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ సుమన్ చల్లా ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం...

**సుధా సోమనీ సిరామిక్స్ ఉద్యోగులకు ఉచిత దంత వైద్య శిబిరం..**

వెంకటగిరి, జూన్ 3(ప్రజా ప్రతిభ ):






వెంకటగిరి మండల పరిధిలోని సుధా సోమనీ సిరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగులు, కార్మికుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సుమన్ ప్రజా దంత వైద్యశాల చీఫ్ కన్సల్టెంట్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చల్లా సుమన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చల్లా సుమన్ మాట్లాడుతూ, దంత ఆరోగ్యం ప్రతి వ్యక్తి ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని, నోటి పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. శిబిరంలో ఉద్యోగులు, కార్మికులకు దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు, సలహాలు అందించారు. ప్రస్తుత కాలంలో యువతతో పాటు వివిధ వయసుల వారు పాన్ పరాగ్, గుట్కా, ముక్కుపుడి వంటి పొగాకు ఉత్పత్తులను ఎక్కువగా వినియోగిస్తున్నారన్నారు. అయితే వీటి వాడకం వల్ల దంతాలు, నోటి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని దంత వైద్య నిపుణులు డాక్టర్ సుమన్ తెలియజేశారు. పొగాకు పదార్థాల్లో ఉండే హానికర రసాయనాల కారణంగా దంతాలు పసుపు రంగులోకి మారడంతో పాటు నల్లటి మరకలు ఏర్పడతాయన్నారు. అలాగే చిగుళ్లు బలహీనపడి వాపు, రక్తస్రావం వంటి సమస్యలు తలెత్తుతాయని, కాలక్రమేణా దంతాలను పట్టి ఉంచే ఎముకలు దెబ్బతిని దంతాలు కదలడం, ఊడిపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయన్నారు. అంతేకాకుండా నోటిలో దుర్వాసన, పూతలు, తెల్లటి లేదా ఎర్రటి మచ్చలు ఏర్పడే ప్రమాదం కూడా ఉంది. ఇవి నిర్లక్ష్యం చేస్తే నోటి క్యాన్సర్‌కు దారితీసే అవకాశం ఉందని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ విజయ్ కుమార్, డాక్టర్ లీల కేశవ్ మరియు ప్రజా దంత వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఇన్‌పేషంట్లకు ఉచిత మధ్యాహ్న భోజనం

**మార్పు సంస్థ సేవలకు ప్రశంసలు...**





వెంకటగిరి, జూన్ 3(ప్రజా ప్రతిభ ):

వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇన్‌పేషంట్లకు మార్పు సంస్థ వ్యవస్థాపకులు పవన్ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉచితంగా మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారు. ఈ కార్యక్రమం 30 రోజుల నుండి కొనసాగుతుంది. ఇందులో భాగంగా బుధవారం వెంకటగిరి శ్రీ ధర్మ శాస్త అయ్యప్ప స్వామి భక్త బృందం సభ్యులు అవ్వారు కృష్ణయ్య పాల్గొని ప్రభుత్వ ఆసుపత్రిలోని ఇన్ పేషెంట్లకు భోజనం పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందులతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులకు ఈ సేవ ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తోందని ఆయన తెలిపారు .మార్పు సంస్థ సభ్యులు ప్రతిరోజు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని తయారు చేసి ఆసుపత్రిలోని ఇన్‌పేషంట్లకు పంపిణీ చేస్తున్నారని,రోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. అలాగే మార్పు సంస్థ చేపడుతున్న ఈ సేవా కార్యక్రమం ఎంతో గొప్పదని, ఆసుపత్రిలో ఉన్న సమయంలో భోజనంపై ఆందోళన లేకుండా చికిత్స పొందేందుకు ఇది సహాయపడుతోందని తెలిపారు. సమాజ సేవే లక్ష్యంగా మార్పు సంస్థ ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని తెలియజేశారు.

# మైనార్టీ నాయకుడు రహంతుల్లా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ జన్మదిన సంబరాలు

వాకాడు జూన్ 3 ప్రజా ప్రతిభ



తిరుపతి జిల్లా వాకాడు: గూడూరు శాసనసభ్యులు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశం సునీల్ కుమార్ జన్మదిన సంబరాలు వాకాడు మైనార్టీ నాయకుడు ఎస్.కె రహంతుల్లా ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా, వైభవంగా, అట్టహాసంగా బుధవారం రాత్రి వాకాడు బజారు వీధిలో జరిగాయి. సునీల్ కుమార్ జన్మదిన భారీ కేకును వాకాడు మండలం టిడిపి అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్ రెడ్డి కట్ చేసినారు. నాయకులకు, కార్యకర్తలకు రహంతుల్లా కేకు, మిఠాయిలను పంపిణీ చేశారు. వాకాడు బజారు వీధిలో పండగ వాతావరణం నెలకొన్నది. తమ అభిమాన,ప్రియతమ నాయకుడు ఆయుష్షు,ఆరోగ్యం, సిరి సంపదలతో, రాజకీయ ఉన్నత పదవులు అధిరోహించాలని అల్లాను ప్రార్థించినట్లు రహమతుల్లా తెలిపారు .ఈ సంబరాల్లో మాజీ సర్పంచ్ భార్గవ్ రామ్, చిన్న వెంకటేశ్వర స్వామి టెంపుల్ మెంబర్, మాజీ జడ్పిటిసి ప్రమీల,కే వి సి ప్రెసిడెంట్, టిడిపి నాయకుడు వేము దినకర్, మైనార్టీ నాయకులు బాబు, కాలేషా, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

# వాకాడు చర్చ్ కాంపౌండ్‌లో

**పూడిపోయిన ఆక్రమణకు గురైన డ్రైనేజీ కాలువను పరిశీలించిన డి ఎల్ పి ఓ.**





వాకాడు జూన్ 3 ప్రజా ప్రతిభ

తిరుపతి జిల్లా వాకాడు: చర్చి కాంపౌండ్ లోని డ్రైనేజీ కాలువ, పూడిపోయి కాలువ చివరి భాగాన ఆక్రమణకు గురై ఉండడంతో డ్రైనేజీ నీరు రోడ్డుపై ప్రవహిస్తునడం, స్థానికంగా నివాసం ఉంటున్న వారికి తీవ్ర అసౌకర్యం, దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్న నే పద్యములో టిడిపి నాయకుడు వేము దినకర్ గత నెలలో స్థానిక అధికారులకు, జిల్లా, డివిజన్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈరోజు డి ఎల్ పి ఓ, డి డి ఓ చిన్న రెడ్డప్ప స్థానిక ఎంపీడీవో సాయిప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో దేవదానం లు తో కలిసి ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. స్థానికుడు, టిడిపి నాయకుడు వేము దినకర్ డీఎల్పీఓ కు ఆ డ్రైనేజీ కాలువ గూర్చి పూర్తిగా వివరించారు. డి ఎల్ పి ఓ మాట్లాడుతూ డ్రైనేజీ కాలువ పూడిపోవడం,కాలవ చివరి భాగాన అక్కడ ఉన్న పొలాలు వారు అడ్డు వేయడం వలన సమస్య ఏర్పడినది, ఆ పొలం వారు తమ పొలములోకి డ్రైనేజీ నీరు వస్తుందని ఆక్షేపణ తెలుపుతున్నారు, కాలువ ఎంతవరకు ఉన్నది సర్వే చేయించి తదుపరి చర్యలు తీసుకుంటామని డి ఎల్ పి ఓ తెలిపారు. త్వరితగతిన ఈ సమస్యను పరిష్కరించాలని వేము దినకర్ డీఎల్పీఓ కు సూచించారు.

# వెంకన్నపాళెం బడిలో శిథిల భవనాల కూల్చివేత ప్రారంభం



కోట జూన్ 3 ప్రజా ప్రతిభ

నెల్లూరు జిల్లా కోట వెంకన్నపాళెం బడికి గ్రహణం.. విద్యాకుసుమాల విలవిల' శీర్షికన ప్రచురితమైన వార్తాకథనానికి అధికారులు వెనువెంటనే స్పందించారు. పాఠశాల ఆవరణలో శిథిల భవనాలపై వచ్చిన వార్తకు స్పందనగా, శిథిలావస్థలో ఉన్న పాత తరగతి గదుల కూల్చివేత పనులకు అధికారులు ఈరోజు ఉదయం అత్యంత వేగంగా శ్రీకారం చుట్టారు. వేసవి సెలవుల్లోనే ఈ ప్రమాదకరమైన కట్టడాలను తొలగిస్తామని గతంలో ఇచ్చిన మాట ప్రకారం, కోట మండల విద్యాశాఖాధికారిణి శిరీష పర్యవేక్షణలో ఈ కూల్చివేత పనులు చురుగ్గా ప్రారంభమయ్యాయి. వార్త ప్రచురితమైన సమయంలో ఎంఈఓ శిరీష పాఠశాలలోని పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి, చేసిన విజ్ఞప్తికి ఎంపీడీఓ దిలీప్ కుమార్ నాయక్ తక్షణమే స్పందించి ప్రత్యేక శ్రద్ధ కనబరచి, అవసరమైన చర్యలు చేపట్టారు. విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే నాటికి పిల్లలకు సురక్షితమైన వాతావరణం కల్పించేలా అధికారులు తీసుకున్న ఈ నిర్ణయం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

# రైతులకు ఉచితంగా రాగి విత్తనాలు పంపిణి



కుప్పం,జూన్ -3(ప్రజా ప్రతిభ):

కుప్పం మండల పరిధిలోని చెక్కినత్తం గ్రామంలో రైతులకు ఉచితంగా రాగి విత్తనాలు పంపిణీ చేశారు. వ్యవసాయ పరిశోదనా స్థానం, పెరుమాళ్ళ పల్లి, తిరుపతి వారి ఆధ్వర్యంలో చెక్కునతం గ్రామంలో ఎస్సీ రైతులకు రాగి విత్తనాలు మరియు వాల్యూ అడిషన్ కు అవసరం అయినా వస్తువులు పంపిణీ చేయడం జరిగింది. ఎస్సీ మహిళా రైతులు సెంట్రల్ స్కీం ద్వారా ఆర్థిక వృద్ధి సాధించాలని ప్రధాన శాస్త్రవేత శాంతిప్రియ సూచించారు. మండల పార్టీ అధ్యక్షులు రాజగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు రైతులు తెల్సుకొని దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారి ఫయాజ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రైతులకు అన్ని పథకాలు రావాలంటే ఏపిఎఫ్ఆర్( రైతుల గుర్తింపు కార్డు ) ఉచితంగా పొందాలని రైతు భరోసా కేంద్రంలో గాని, అగ్రికల్చర్ ఆఫీస్ లో గాని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, శాస్త్రవేత్తలు నాగమణి, సరళ పాల్గొన్నారు.

ప్రజా ప్రతిభ
ఆంధ్రప్రదేశ్ జిల్లాలు
AndhrapradeshDistricts
Praja Pratibha Telugu Daily
www.prajapratibha.in Prajapratibha.2013@gmail.com
గురువారం
జూన్ 04, 2026

## కొత్తవలసలో 'ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం'

### పనులను త్వరగా పూర్తి చేయాలి

### మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి వినతి



శృంగవరపుకోట జూన్ 3 (ప్రజా ప్రతిభ -ఎం.రమణ )

రాష్ట్ర సచివాలయంలో పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్.కోట నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులపై మంత్రికి ఆమె వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా కొత్తవలసలో గతంలో నిలిచిపోయిన ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. 2014-19 తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే ఈ కేంద్రానికి భూమి కేటాయించి, దాదాపు 15 శాతం వరకు పనులు పూర్తి చేశామని.. అయితే ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసి, పనులను నిలిపివేసిందని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం క్రీడలకు, యువత ప్రగతికి పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో.. ఈ క్రీడా వికాస కేంద్రం పనులను పునఃప్రారంభించి, వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని లలితకుమారి విజ్ఞప్తి చేశారు. ఆధునిక వసతులతో కూడిన ఈ కేంద్రం పూర్తయితే స్థానిక యువత క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించడానికి ఎంతో ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు. దీనితో పాటు, నియోజకవర్గ ప్రజల ప్రజా రవాణా, పర్యాటక సౌకర్యాల మెరుగుదలలో భాగంగా.. ఎస్.కోట నియోజకవర్గం నుండి ప్రముఖ పర్యాటక ప్రాంతమైన అరకు తదితర ప్రాంతాలకు కొత్తగా ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచాలని కోరారు. ఎమ్మెల్యే వినతులపై సానుకూలంగా స్పందించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి , ఈ వ్యవహారాలపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## మునికూడలిలో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులను పరిశీలించిన

### ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

### వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ కావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.





సీతానగరం జూన్ 03 (ప్రజా ప్రతిభ)

రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ బత్తుల బలరామకృష్ణ గారు సీతానగరం మండలం మునికూడలి గ్రామంలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యతను, పురోగతిని పర్యవేక్షించిన ఎమ్మెల్యే శ్రీ బత్తుల బలరామకృష్ణ గారు, సంబంధిత అధికారులకు మరియు కాంట్రాక్టర్‌కు పలు కీలక సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు సకాలంలో అందేలా చూడటమే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. భవన నిర్మాణ పనులను ఎలాంటి అలసత్వం లేకుండా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

ఈ పర్యటనలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ పార్టీల స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రాజయ్యపేట ఉపాధి పనుల్లో భారీ అక్రమాలు

### జూమ్‌కాల్‌తో 200 దొంగ మస్టర్లు!

### గ్రౌండ్ లెవెల్‌లో ఎంపీడీవో, ఏపీవో విచారణ.. 'నివేదిక అనంతరం చర్యలు' అని వెల్లడి.. పీడీ ప్రకటనపై గ్రామస్తుల ఆగ్రహం

నక్కపల్లి, జూన్ 3, (ప్రజా ప్రతిభ)








అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో భారీగా అవకతవకలు చోటుచేసుకున్నాయని గ్రామస్తులు ఆరోపించడంతో కలకలం రేగింది. గ్రామంలో ప్రత్యక్షంగా పనిచేయని వ్యక్తులకు, ఇతర ప్రాంతాల్లో ఉన్నవారికి సైతం జూమ్ కాల్ ద్వారా మస్టర్లు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలపై సోమవారం ఎంపీడీవో చలపతిరావు, ఏపీవో భాగ్యలత గ్రామానికి చేరుకుని క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. 200 మందికి దొంగ మస్టర్ల ఆరోపణగ్రామ జనసేన నాయకులు మాట్లాడుతూ.. రాజయ్యపేటలో సుమారు 1500 మంది ఉపాధి హామీ పనుల్లో నమోదై ఉండగా, వారిలో దాదాపు 200 మందికి జూమ్ కాల్ ద్వారా మస్టర్లు వేస్తున్నారని ఆరోపించారు. హాజరు నమోదు, పనుల నిర్వహణ, మస్టర్ల విధానంపై అధికారులు సమగ్రంగా ఆరా తీశారు."కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో ఇలాంటి అక్రమాలు చోటుచేసుకోవడం ఆందోళనకరం. ఒక గ్రామంలోనే ఇంత స్థాయిలో అవినీతి జరిగితే రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు" అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసేవారిపై రాజీలేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పీడీ ప్రకటనపై విమర్శలుఅయితే అధికారులు విచారణ జరుపుతుండగానే అనకాపల్లి జిల్లా పీడీ నిర్మలాదేవి 'ఎంపీడీవో, ఏపీవో ఇప్పటికే విచారణ జరిపారని, రాజయ్యపేటలో అవకతవకలకు అవకాశం లేదు' అని ప్రకటించడంపై గ్రామస్తులు మండిపడ్డారు. "విచారణ పూర్తికాకుండానే పత్రికా ప్రకటనలు ఇవ్వడం సమంజసం కాదు" అని వాపోయారు.విచారణ అనంతరం స్పందించిన ఎంపీడీవో చలపతిరావు, ఏపీవో భాగ్యలత.. "పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపించి చర్యలు తీసుకుంటాం" అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనసేన గ్రామశాఖ అధ్యక్షుడు పిక్కి కోదండరావు (బుజ్జి), నక్కపల్లి మండల ప్రధాన కార్యదర్శి బొంది గురన్న, రాజయ్యపేట పంచాయతీ ఉపాధ్యక్షుడు పిక్కి కొండలరావు, పిక్కి చిన్నారి, విక్కీ కోటేశ్వరరావు, పిక్కి కోటి, పిక్కి కాశి, పిక్కి కిరణ్, గోసల కాశి తదితరులు పాల్గొన్నారు.

# రేబాకలో టీడీపీ యూనిట్ స్థాయి సమావేశం పార్టీ పటిష్ఠతే లక్ష్యం

### యూనిట్ ఇన్‌చార్జి దార్ల కృష్ణ ఆధ్వర్యంలో ఐదు గ్రామాల నాయకుల సమీక్ష : స్థానిక ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశం

నక్కపల్లి, జూన్ 3, (ప్రజా ప్రతిభ)





పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం రేబాక గ్రామంలో క్లస్టర్-6, యూనిట్-28 పరిధిలోని టీడీపీ యూనిట్ స్థాయి సమావేశం బుధవారం ఘనంగా జరిగింది. రేబాక, ముకుందరాజుపేట, రమణయ్యపేట, గుల్లిపాడు, ఉద్దండపురం గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.యూనిట్ ఇన్‌చార్జి దార్ల కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దార్ల కృష్ణ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత పటిష్ఠం చేసేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని అన్నారు. అదేవిధంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచార కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు కర్రీ ఆంజనేయులు, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షులు గంట్యాడ రమేష్ పాల్గొని దిశానిర్దేశం చేశారు. ముకుందరాజుపేట గ్రామ శాఖ అధ్యక్షులు దార్ల నాగరాజు, రేబాక గ్రామ శాఖ అధ్యక్షులు కారణం సూరిబాబు, రమణయ్యపేట అధ్యక్షులు కంఠం చిట్టిబాబు, గుల్లిపాడు అధ్యక్షులు కొమర్తి సోమచంద్ర మోహన్, ఉద్దండపురం అధ్యక్షులు కుర్ర బాబ్జి, నీటి సంఘం అధ్యక్షులు వెలంకయల అప్పారావు, నక్కపల్లి మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు జి. శ్రీను, తిరుపతిపాలెం గ్రామ శాఖ అధ్యక్షులు జి. శ్రీను, నాయకులు కసిరెడ్డి బుజ్జితో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు.

# రైతుపై కక్షసాధింపు దాష్టీకం

### సరుగుడు తోటకు నిప్పు - రూ.15 లక్షల పంట బుగ్గిలి

### నక్కపల్లిలో కలకలం - రాష్ట్ర హోంమంత్రి నియోజకవర్గంలోనే శాంతిభద్రతలకు సవాల్





నక్కపల్లి, జూన్ 3, (ప్రజా ప్రతిభ)

నక్కపల్లి మండలం చిన్నదొడ్డిగల్లు గ్రామంలో రైతు కుటుంబంపై గుర్తు తెలియని దుండగులు కక్షసాధింపు చర్యలకు తెగబడ్డ ఘటన వెలుగుచూసింది. సుమారు రూ.15 లక్షల విలువైన సరుగుడు పంటను దారుణంగా తగలబెట్టి సర్వనాశనం చేయడంతో ప్రశాంతంగా ఉన్న పాయకరావుపేట నియోజకవర్గంలో ఒక్కసారిగా కలకలం రేగింది.5 ఎకరాల సరుగుడు తోట బుగ్గిపాలుగ్రామానికి చెందిన రైతు కర్రీ అప్పారావు సర్వే నెంబర్ 556/1, 2, 3లోని 5 ఎకరాల భూమిలో సరుగుడు తోట సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అయితే కొందరు దుండగులు కక్షగట్టి ఆ తోటకు నిప్పుపెట్టడంతో పంట పూర్తిగా కాలిబూడిదైంది. దీంతో ఆ కుటుంబం జీవనాధారం కోల్పోయింది.'ప్రాణాలకే ప్రమాదం' - బాధిత రైతు కన్నీటి ఆవేదన"మా కుటుంబం మొత్తం ఈ పంటలపైనే ఆధారపడి బతుకుతున్నాం. ఎవరితోనూ వ్యక్తిగత కక్షలు లేవు. అయినా కొందరు కావాలనే మా నాశనం కోరుకుంటున్నారు. అనుమానితులపై పోలీసులకు ఫిర్యాదు చేసినా 24 గంటలు గడిచినా పట్టించుకోలేదు. ఇప్పుడు బయటకు వెళ్లాలన్నా భయంగా ఉంది. మా ప్రాణాలకూ హాని తలపెడతారేమోనని ఆందోళనగా ఉంది" అని బాధిత రైతు అప్పారావు కన్నీటిపర్యంతమయ్యారు.'హోంమంత్రి నియోజకవర్గంలోనే శాంతిభద్రతలు కరువు' - రైతు సంఘం మండిపాటుఈ ఘటనపై జిల్లా రైతు సంఘం కమిటీ సభ్యుడు ఎం. అప్పలరాజు తీవ్రంగా స్పందించాయి. "రాష్ట్ర హోంమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే శాంతిభద్రతలు కరువయ్యాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. సామాన్య రైతులకు రక్షణ కల్పించలేని పోలీసు వ్యవస్థపై నమ్మకం సడలుతోంది. పంట కాలిపోతోందని మొరపెట్టుకున్నా 24 గంటలైనా స్పందించకపోవడం దారుణం" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి - నష్టపరిహారం ఇవ్వాలినిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని, బాధిత రైతు కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు తగిన నష్టపరిహారం అందించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పోలీసు యంత్రాంగం సత్వరమే స్పందించి రైతులకు భరోసా కల్పించాలని కోరారు.

# గాలివాన బీభత్సం
# గుల్లిపాడు గ్రామాల్లో నీటి కష్టాలు

నక్కపల్లి, జూన్ 3, (ప్రజా ప్రతిభ) :

నక్కపల్లి మండలం గుల్లిపాడు, చుట్టుపక్కల గ్రామాల్లో ఇటీవల వీచిన భీకర గాలివాన తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. గాలివాన ధాటికి విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీని ప్రభావంతో మంచినీటి సరఫరా కూడా ఆగిపోవడంతో గ్రామస్థులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.జనసేన నాయకుల చొరవప్రజల కష్టాలను గుర్తించిన గుల్లిపాడు జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కోమర్తి రమణ, మంగళవారం నక్కపల్లి మండల జనసేన అధ్యక్షుడు వెలగా సుధాకర్, ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్యామ్ కిషోర్ ఆధ్వర్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివప్రసాద్‌ను కలిశారు. గ్రామాల్లో నెలకొన్న విద్యుత్, మంచినీటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, తక్షణమే చర్యలు చేపట్టి మంచినీటి సరఫరాను పునరుద్ధరించాలని వినతిపత్రం అందజేశారు.ఏఈ హామీ: త్వరలోనే పరిష్కారందీనిపై స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివప్రసాద్, సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుని వీలైనంత త్వరగా మంచినీటి సరఫరాను పునరుద్ధరిస్తామని ఆయన తెలిపారు.జనసేన ధ్యేయం: ప్రజా సమస్యల పరిష్కారంఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ, "ప్రజా సమస్యల పరిష్కారమే జనసేన పార్టీ ప్రధాన ధ్యేయం. ప్రజలకు ఇబ్బంది కలిగిన ప్రతి చోటా జనసేన అండగా నిలుస్తుంది" అని స్పష్టం చేశారు.

**విద్యుత్, మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్న ప్రజలు తక్షణమే సహాయ చర్యలు ప్రారంభించాలని, జనసేన మండల అధ్యక్షుడు తో పాటు ప్రధాన కార్యదర్శి విజ్ఞప్తి**



## ఉపమాక వెంకన్న ఆలయంలో భారీ చోరీ..
# రెండు హుండీలు మాయం..!

### ఆరేళ్లుగా లెక్కించని హుండీలు.. రూ.50 లక్షల వరకు చోరీ అంచనా, సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్న పోలీసులు

– నక్కపల్లి, జూన్ 3, (ప్రజా ప్రతిభ) :

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సంచలన చోరీ చోటుచేసుకుంది. గత అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయంలోకి ప్రవేశించి రెండు హుండీలను ఎత్తుకెళ్లారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆలయ సిబ్బందిని విచారిస్తున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. చోరీకి గురైన నగదు, బంగారం, వెండి విలువపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.ఆరేళ్లుగా తెరవని హుండీలుఆలయ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం ఆరేళ్లుగా ఈ హుండీల ఆదాయాన్ని లెక్కించలేదు. దీంతో చోరీకి గురైన సొమ్ము విలువ సుమారు రూ.30 లక్షల నుండి రూ.50 లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. హుండీల్లో భక్తులు సమర్పించిన బంగారు, వెండి ఆభరణాలు కూడా పెద్ద మొత్తంలో ఉన్నట్లు తెలుస్తోంది.రంగంలోకి క్లూస్ టీమ్‌ఘటన తీవ్రత దృష్ట్యా క్లూస్ టీమ్ రంగంలోకి దిగింది. ఆలయ పరిసరాల్లో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరిస్తోంది. పోలీసులు పలు కోణాల్లో విచారణ చేపట్టారు.భక్తుల ఆగ్రహంఇదిలా ఉండగా ఆలయంలో భద్రతా లోపమే చోరీకి కారణమని భక్తులు ఆరోపిస్తున్నారు. టెంపుల్ ఇన్స్పెక్టర్, సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.











# దేశవ్యాప్తంగా జనసేన పార్టీ విస్తరించాలి

### పాదాలమ్మ అమ్మవారికి మొక్కుకున్న జనసేన వీర మహిళ "శ్రావణి సాయి" పసుపు-కుంకుమ, చీర-గాజులు సమర్పించి ప్రత్యేక పూజలు పవన్ సిద్ధాంతాలు ప్రతి రాష్ట్ర యువతకు చేరాలని ఆకాంక్ష

నక్కపల్లి, జూన్ 3, (ప్రజా ప్రతిభ) :

జనసేన పార్టీ కేవలం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకే పరిమితం కాకుండా భారతదేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ విస్తరించాలని ఆకాంక్షిస్తూ కాకినాడ జిల్లా జనసేన వీర మహిళ శ్రావణి సాయి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రత్తిపాడు నియోజకవర్గంలోని నేషనల్ హైవే పక్కన ఉన్న అత్యంత మహిమాన్వితమైన పాదాలమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం ఆమె పసుపు, కుంకుమ, చీర, గాజులను సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.పవన్ సిద్ధాంతాలతో యువతలో చైతన్యంఈ సందర్భంగా శ్రావణి సాయి మాట్లాడుతూ, "జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్  ఆశయాలు, సిద్ధాంతాలు దేశంలోని ప్రతి మూలకు చేరాలి. ఆయన నిస్వార్థ సేవ, పోరాట స్ఫూర్తి యువతలో చైతన్యాన్ని నింపుతున్నాయని అన్నారు. ఈ చైతన్యం ప్రతి రాష్ట్రంలో ప్రతిబింబించేలా జనసేన జెండా దేశవ్యాప్తంగా రెపరెపలాడాలని పాదాలమ్మ తల్లిని మనసారా కోరుకున్నాను" అని తెలిపారు.పాదాలమ్మ అమ్మవారి మహిమలుప్రత్తిపాడు నియోజకవర్గంలోని పాదాలమ్మ అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భక్తుల విశ్వాసం. నేషనల్ హైవేపై ప్రయాణించే వాహనదారులు సైతం అమ్మవారిని దర్శించుకుని వెళ్లడం ఆనవాయితీ. అటువంటి మహిమగల అమ్మవారి ఆశీస్సులతో పార్టీ జాతీయ స్థాయిలో ఎదగడం ఖాయమని జనసేన శ్రేణులు ధీమా వ్యక్తం  చేశారు.శ్రావణి సాయి చేపట్టిన ఈ కార్యక్రమంతో స్థానిక జనసేన నాయకులు, వీర మహిళలు, జనసైనికుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని ఇతర జనసేన ముందుకొస్తున్నారు.





## రామకుప్పం మండలం అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబును కలిసిన

### మండల అధ్యక్షుడు ఎన్ వెంకట రమణ



రామకుప్పం జూన్ 3 (ప్రజా ప్రతిభ)

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు గారిని రామకుప్పం మండలం పార్టీ అధ్యక్షుడు ఎన్ వెంకటరమణ ఈరోజు మర్యాదపూర్వకంగా కలిసి రామకుప్పం మండలం ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలు అభివృద్ధి అవసరాలు మరియు పెండింగ్ లో ఉన్న పనులపై సమగ్ర వినిత పత్రం సమర్పించారు. మండల ప్రజల సంక్షేమం రైతుల అభ్యున్న తి గ్రామీణ మౌలిక సదుపాయాల బలోపేతం లక్ష్యంగా గ్రామీణ రహదారులు నిర్మాణము హౌసింగ్ మరియు ఇల్లు పట్టాలు మంజూరు. జల్ జీవన్ మిషన్ పనులు పురోగతి హెచ్ ఎన్ ఎస్ ఎస్ ద్వారా సాగునీటి విస్తరణ ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ గోవిందపల్లి ఆరిమానిపెంట డబుల్ రోడ్డు రహదారి అభివృద్ధి గృహ అవసరాలు పరిష్కారం అభివృద్ధి పనులు బిల్లల చెల్లింపు పలు సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. మండలంలోని అవసరమైన నిధులను మంజూరు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు.

## కుమిడికుంటి గ్రామస్తులు
# ఏకమై రోడ్డు శ్రమదానం

### తక్షణమే సీసీ లేదా బీటీ రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తుల విజ్ఞప్తి







ఆలూరి జిల్లా/డుంబ్రిగూడ, జూన్ 3(ప్రజా ప్రతిభ)

డుంబ్రిగుడ మండలంలోని కొల్లాపుట్టు పంచాయతీ పరిధిలో ఉన్న కుమిడికుంటి గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శ్రమదానంతో రోడ్డును మరమ్మతు చేసుకుంటున్నారు. ఎన్నో సంవత్సరాలుగా సరైన రహదారి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామ ప్రజలు తమ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

గ్రామస్తుల వివరాల ప్రకారం, 2016–17 సంవత్సరాల్లో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. కొంతమేర పనులు నిర్వహించినట్లు చేసి మధ్యలో డస్ట్ పోసి పనులను నిలిపివేశారని వారు ఆరోపించారు. అనంతరం పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఎలాంటి పరిష్కారం లభించలేదని తెలిపారు.గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వంతాల సీతారాం మాట్లాడుతూ, గతంలో వేసిన రోడ్డు భారీ వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతినడంతో ప్రస్తుతం రాకపోకలు అత్యంత ప్రమాదకరంగా మారాయని తెలిపారు. ముఖ్యంగా రోడ్డు మలుపుల వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని పేర్కొన్నారు.రోడ్డు మరింత దెబ్బతినకుండా ఉండేందుకు గ్రామస్తులే శ్రమదానంతో పెద్ద బండరాళ్లు పేర్చి రక్షణ గోడ నిర్మించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. అలాగే భారీ వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డుపై మట్టిని పోసి తాత్కాలికంగా రాకపోకలు కొనసాగించేలా చర్యలు చేపట్టారు. అయితే ఇది శాశ్వత పరిష్కారం కాదని, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన రహదారి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చినప్పుడు, గర్భిణీలు, వృద్ధులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కుమిడికుంటి గ్రామానికి సీసీ రోడ్డు లేదా బీటీ రోడ్డు మంజూరు చేసి గ్రామ ప్రజల రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి కుమిడికుంటి గ్రామానికి నాణ్యమైన రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు.ఈ శ్రమదాన కార్యక్రమంలో గ్రామస్తులు వంతాల సీతారాం (ఆటో డ్రైవర్), వంతాల చిన్నయ్య, వంతాల దాసు (పీసా కమిటీ కార్యదర్శి), వంతాల నర్సులు, కొర్రా శాంతి తదితరులు పాల్గొన్నారు.

# కిషోరి వికాసం, అంగన్వాడీ పిలుస్తోంది

## కార్యక్రమం పై పిల్లలకు అవగాహన





బంగారు పాళ్యం.జూన్ 3.(ప్రజా ప్రతిభ)

చిత్తూరు జిల్లా బంగారు పాళ్యం మండలం తుంబకుప్పం అంగన్వాడి కేంద్రం నందు కిషోరి వికాసం, అంగన్వాడి పిలుస్తుంది అనే కార్యక్రమం మండల సిడిపిఓ వినిత శ్రీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిడిపిఓ వినిత శ్రీ మాట్లాడుతూ, పిల్లలకు ఆటపాటలతో పాటు మంచి విద్యను అందించాలని అంగనవాడి వర్కర్ విమలాకు సూచించారు. కిషోరి పిల్లలకు అనిమీయ గురించి అవగాహన కల్పించడం జరిగింది. పిల్లలు మంచిగా ఎలా నడుచుకోవాలి అనే దానిపై పిల్లలను ఉద్దేశించి ప్రసంగించారు. చెడు ప్రవర్తనలకు అలవాటు కాకూడదని పిల్లలకు అవగాహన కల్పించారు. తదుపరి సూపర్వైజర్ పామీద బేగం మాట్లాడుతూ, పిల్లలు సత్ప్రవర్తనతో మెలగాలని ఆమె సూచించారు. బాల్య వివాహాలు మరియు కౌమార దశలో గర్భధారణ వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ కవిత, చైల్డ్ వెల్ఫేర్ రాజేంద్ర, రియల్ ఏ ఎన్ జి ఓ రామారావు, అంగన్వాడి వర్కర్స్ విమల, అమృత, మమత, అంగన్వాడి హెల్పర్స్ వరలక్ష్మి, కృష్ణవేణి,భువనేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

# సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న

## బెటప్ప నాయుడు



గుడుపల్లి జూన్ 03 ప్రజా ప్రతిభ :-

ఓఎన్ కొత్తూరు గ్రామ పంచాయతీ పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో క్లస్టర్ ఇంచార్జ్ బెటప్ప నాయుడు మాట్లాడుతూ రాబోవు స్థానిక ఎన్నికలపై చర్చించి ప్రజలకు పార్టీ కార్యకర్తల కు అండగా ఉంటామని చెప్పారు ఈ కార్యక్రమం లో యూనిట్ ఇంచార్జ్ లు పార్టీ అధ్యక్షుడు, బూత్ ఇంచార్జ్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# అక్రమ మట్టి రవాణాపై

# కసింకోట సీఐ స్వామినాయుడు

## రెండు ట్రాక్టర్లు పట్టివేత.. మైన్స్ శాఖకు అప్పగింత




విశాఖ ఉమ్మడి జిల్లా బ్యూరో.అనకాపల్లి కసింకోట, జూన్ 3

కసింకోట పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని మైన్స్ అండ్ జియాలజీ శాఖ అధికారులకు అప్పగించారు. వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా వెళ్తున్న రెండు ట్రాక్టర్లను ఆపి పరిశీలించగా, సంబంధిత అనుమతి పత్రాలు లేకుండానే మట్టి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు.దీంతో ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల కోసం మైన్స్ అండ్ జియాలజీ శాఖ అధికారులకు అప్పగించారు. అనంతరం అధికారులు విచారణ చేపట్టి నిబంధనలను ఉల్లంఘించినందుకు ఒక్కో ట్రాక్టర్‌పై రూ.8 వేల చొప్పున జరిమానా విధించారు.ఈ సందర్భంగా కసింకోట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. స్వామినాయుడు మాట్లాడుతూ, అక్రమ మట్టి రవాణా, అక్రమ తవ్వకాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో అక్రమ మట్టి తవ్వకాలు, రవాణా వంటి కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

# విజయవంతంగా "పల్లె వీక్షణ" కార్యక్రమం...

## విజయవంతంగా "పల్లె వీక్షణ" కార్యక్రమం... ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల విస్తృత పర్యటన ...






వెంకటగిరి, జూన్ 3(ప్రజా ప్రతిభ ):

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ?వెంకటగిరి నియోజకవర్గంలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సత్వర పరిష్కారం చూపే దిశగా చేపట్టిన "పల్లె వీక్షణ" కార్యక్రమం బుధవారం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ , జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఇతర అధికారులతో కలిసి కలువాయి మండలములో కూల్లూరు విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీ సెంటర్లు, మరియు చెక్ డ్యామ్‌లను వారు స్వయంగా పరిశీలించారు.
ఈ పర్యటనలో ముఖ్య అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు.

### గ్రామాభివృద్ధికి భారీ నిధులు:

పల్లె వీక్షణ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని వివిధ అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ. 6.80 కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే ఎబతీబస్త్రశీఅంశ్రీఖ తెలిపారు. ఇందులో ఆసుపత్రికి రూ. 36 లక్షలు, ఎఫ్‌డిఆర్ పనులకు రూ. 1.23 కోట్లు, రాపూరులో అభివృద్ధి పనులకు రూ. 30 లక్షలు కేటాయించడం జరిగింది.

### నకిలీ రిజిస్ట్రేషన్లు, దొంగ పట్టాలపై ఉక్కుపాదం:

ఎస్సీ, ఎస్టీ మరియు భూమిలేని పేదల భూములను ఆక్రమించి నకిలీ పత్రాలు, దొంగ పట్టాలు సృష్టిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు.
అలాంటి వారిపై పీడీ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకుంటామని, భూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

### వ్యవసాయం మరియు పాడి పరిశ్రమ అభివృద్ధి:

నెల్లూరు జిల్లాలో 'ఛాంపియన్ ఫార్మర్' స్కీం కింద మామిడి సాగులో కవర్లు వాడి ఎకరానికి అదనంగా ఒక టన్ను దిగుబడి, కేజీకి రూ. 10-15 అదనపు లాభం పొందుతున్న విధానాన్ని రైతులందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పాడి రైతుల ఆర్థిక అభివృద్ధి కోసం, పశువులకు కృత్రిమ గర్భధారణ ద్వారా కేవలం ఆడ దూడలు మాత్రమే పుట్టేలా నూతన విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.ప్రజల వద్దకే పాలన అందించాలన్న సదుద్దేశంతో నిర్వహించిన ఈ గ్రామ సభలలో వచ్చిన ప్రతి ఆర్జీని, ఫిర్యాదును ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేసి, యూనిక్ నెంబర్ కేటాయిస్తున్నట్లు తెలిపారు.రాబోయే 30 రోజుల్లో ఈ సమస్యలన్నింటినీ అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రజలకు హామీ ఇచ్చారు.అదే విధంగా ఈ మండలములో 9 మందికి 9 లక్షల 48 వేలు రూపాయలతో సి. యం. ఆర్. ఎఫ్ చెక్కులు పంపిణి

# జన విశ్వాస్ - సురక్షిత త్రిచక్ర వాహన ప్రయాణాలు పై అవగాహన



బంగారు పాళ్యం జూన్ 3. (ప్రజా ప్రతిభ)

చిత్తూరు జిల్లా ఎస్పీ శ్రీ తుషార్ దూడి, ఐపీఎస్ ప్రజల భద్రత, మహిళల రక్షణ, నేరాల నివారణ మరియు ప్రజలకు సురక్షితమైన వ్యవస్థను అందించేందుకు, ప్రజలతో మరింత సన్నిహిత సంబంధాలను పెంపొందిస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజల్లో భద్రతాభావం మరియు పోలీసు శాఖపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ముందడుగు వేసారు.
ఈ కార్యక్రమంలో బాగంగా బంగారు పాళ్యం ఇన్స్పెక్టర్ శ్రీ కత్తి శ్రీనివాసులు మండలంలోని అన్ని ఆటోలకు స్టికర్ లను అంటించడం జరిగింది. ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ మండలంలోని ఆటోరిక్షాలకు ప్రత్యేక పోలీసు గుర్తింపు సంఖ్య మరియు ప్రత్యేక క్యూఆర్ కోడ్ కలిగిన స్టిక్కర్లను ఆటోలకు అతికించినట్లు, ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా సంబంధిత ఆటో, డ్రైవర్, యజమాని, వాహనానికి సంబంధించిన అధికారిక వివరాలు మరియు ఇతర అవసరమైన సమాచారం అధికారులకు తక్షణమే అందుబాటులో ఉండే విధంగా వ్యవస్థను ఎస్పీ గారు రూపొందించారని తెలిపారు.ఈ చర్య ద్వారా ప్రయాణికుల భద్రత పెరగడంతో పాటు, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ మరియు ప్రజలకు మరింత నమ్మకమైన రవాణా సేవలు అందించడం సాధ్యమయ్యేలా ఎస్పీ ఈ కార్యక్రమం రూపొందించారని బంగారుపాళ్యం సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు.





## కాజల్.. 'జిగేల్'

- కొత్త ఫొటో షూట్‌లో చెమటలు పట్టిస్తున్న చందమామ
- పెళ్లై, బాబు పుట్టినా తగ్గని గ్లామర్ డోస్
- 'హలో జూన్' అంటూ సమ్మర్ వైబ్స్‌తో పిచ్చెక్కించిన బ్యూటీ
- నెట్టింట వైరల్ అవుతున్న హాట్ లుక్స్

**టాకీస్:** టాలీవుడ్ 'చందమామ' కాజల్ అగర్వాల్ సోషల్ మీడియాలో మరోసారి సెన్సేషన్ సృష్టించింది. పెళ్లై, ఒక బాబుకు తల్లి అయినా కూడా తన గ్లామర్ ఏమాత్రం తగ్గలేదని నిరూపిస్తూ ఇన్ స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఒక హాట్ ఫోటో ఇప్పుడు నెట్టింట మంటలు రేపుతోంది. కొత్తగా వచ్చిన జూన్ నెలకు అదిరిపోయే రేంజ్ లో వెల్కమ్ చెప్తూ సమ్మర్ వైబ్స్‌తో కుర్రకారుకు పిచ్చెక్కించింది.

### సమ్మర్ సూర్యుడి కంటే హాట్‌గా..

ఈ లేటెస్ట్ ఫోటో షూట్‌లో కాజల్ అగర్వాల్ చాలా కాన్ఫిడెంట్‌గా, ఎంతో బోల్డ్‌గా ఫోజ్ ఇచ్చింది. బ్రైట్ కోరల్ ఆరెంజ్ కలర్ ఓవర్ సైజ్డ్, వైడ్-స్లీవ్స్ క్రాప్ టాప్‌లో ఆమె మెరిసిపోయింది. చేతులను పైకెత్తి, ప్రశాంతమైన లుక్‌తో సమ్మర్ సూర్యుడి కంటే హాట్‌గా కనిపిస్తూ కుర్రకారు మనసు దోచేసింది. జూన్ నెల రాకను సెలబ్రేట్ చేస్తూ ఆమె షేర్ చేసిన ఈ 'హలో జూన్' వైబ్స్ నెట్టింట తెగ హల్‌చల్ చేస్తున్నాయి.

### క్రేజీ లుక్.. స్పెషల్ అట్రాక్షన్!

ఈ సమ్మర్ ఫోటో షూట్‌లో కాజల్ వేసుకున్న బాటమ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆరెంజ్ క్రాప్ టాప్‌కు మ్యాచింగ్‌గా ఆమె ధరించిన 'డిస్ట్రెస్డ్ డెనిమ్ హాట్ షార్ట్స్' లుక్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి.

### సింప్లిసిటీకి కేరాఫ్ అడ్రస్..

అతిగా హడావుడి లేకుండా చాలా సింపుల్‌గా చేతులకు బంగారు ఉంగరాలు పెట్టుకుని, జుట్టును మధ్యలోకి పాయతీసి సాఫ్ట్ వేవ్స్‌లాగా వదిలేసింది. ఇక ఆమె వేసుకున్న నేచరల్ మేకప్ ఈ బోల్డ్ అండ్ క్యాజువల్ లుక్‌ను మరింత అందంగా మార్చేసింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి.



## అబ్బాయ్ సినిమాకు బాబాయ్ ఆశీస్సులు

### - 'పెద్ది' కోసం పవన్ స్పెషల్ వీడియో

**టాకీస్:** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కించిన 'పెద్ది' సినిమాపై అంచనాలు పెరుగుతున్న వేళ.. జనసేన అధినేత, చెర్రీ బాబాయ్ పవన్ కల్యాణ్ ఆ చిత్రానికి తన మద్దతు తెలిపారు. 'పెద్ది' టీమ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన విడుదల చేసిన ఓ ప్రత్యేక వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది.



పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ 'ఎక్స్' ఖాతా ద్వారా విడుదలైన ఈ వీడియోలో రామ్ చరణ్ సినీ ప్రయాణంలోని పలు ముఖ్యమైన సన్నివేశాలను పొందుపరిచారు. రామ్ చరణ్ అనే పేరులోనే శ్రీరామభక్తుడైన హనుమంతుడి లక్షణాలు ఉన్నాయని, ఆయన భక్తి, శక్తి, సమర్పణ భావాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పోలిక అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

భారీ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న 'పెద్ది' చిత్రం రేపు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొని ఉండగా, పవన్ స్వయంగా వీడియో విడుదల చేయడం ఆ అంచనాలను మరింత పెంచింది. 'పెద్ది' సినిమా మార్గంలో ఎలాంటి అడ్డంకులు ఎదురవకుండా ఆంజనేయస్వామి ఆశీస్సులు ఉండాలని, ఈ చిత్రం ఘన విజయం సాధించి ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించాలని పవన్ కల్యాణ్ తన వీడియోలో ఆకాంక్షించారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## చంద్రబాబు, రేవంత్ రెడ్డి, పవన్ కల్యాణ్‌లకు రామ్ చరణ్ కృతజ్ఞతలు

**టాకీస్:** గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తాజా చిత్రం 'పెద్ది' నేడు గురువారం ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతోంది. భారీ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా టికెట్ ధరలను పెంచుకోవడానికి రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు అనుమతించిన సంగతి తెలిసిందే. ఈ ఇరు రాష్ట్రాల ప్రభుత్వ పెద్దలకు రాంచరణ్ ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు.

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు:** "తెలుగు సినిమా పరిశ్రమకు నిరంతరం మద్దతు, ప్రోత్సాహం అందిస్తున్న గౌరవనీయులైన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు గారు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ గారు మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని రామ్ చరణ్ పేర్కొన్నారు.

**తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు:** "తెలుగు చిత్ర పరిశ్రమ అభ్యున్నతికి నిరంతరం తోడ్పాటునందిస్తున్న గౌరవనీయులైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు మరియు తెలంగాణ ప్రభుత్వానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని చరణ్ రాసుకొచ్చారు.

ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ నటించింది. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతి బాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహించారు. ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

## వైట్ మ్యాక్సీలో 'కృతి సనన్'

- సైడ్ అందాలతో సెగలు రేపుతున్న బాలీవుడ్ భామ
- స్టైలిస్ట్ సుకృతి గ్రోవర్ మ్యాజిక్.. నెట్టింట కృతి లేటెస్ట్ పిక్స్ వైరల్
- నెక్ బోసిగా ఉంచి.. పొడువాటి ఇయర్ రింగ్స్‌తో అదిరిపోయే పోజ్
- తెల్లటి డ్రెస్‌లో దేవకన్యలా మెరిసిపోతున్న ముద్దుగుమ్మ

**టాకీస్:** సినీ సెలబ్రిటీలు నిత్యం దేవకన్యల్లా మెరిసిపోతూ, గ్లామర్ టచ్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారంటే.. వారి వెనుక డిజైనర్లు, స్టైలిస్టుల కష్టం ఎంత ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఒకప్పుడు తెర వెనుక ఉన్న వీరి గురించి పెద్దగా తెలిసేది కాదు కానీ, సోషల్ మీడియా వాడకం పెరిగాక ట్రెండ్ మారింది. సెలబ్రిటీలతో పాటు వారి స్టైలిస్టులు కూడా ఇప్పుడు ఇంటర్నెట్‌లో సెన్సేషన్ అవుతున్నారు. తాజాగా బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ స్టైలిస్ట్ సుకృతి గ్రోవర్ షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు నెట్టింట గిలిగింతలు పెడుతున్నాయి.

### వైట్ మ్యాక్సీలో వయ్యారాల విందు!

నిత్యం తన కిల్లింగ్ లుక్స్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారే కృతి సనన్, తాజాగా సరికొత్త అవుట్‌ఫిట్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. వైట్ కాంబినేషన్‌లో ఉన్న హై కాంట్రాస్ట్ మ్యాక్సీ డ్రెస్‌ను ధరించి హొయలు పోయింది. ఈ డ్రెస్‌లో తన సైడ్ అందాలను చూపిస్తూ కృతి ఇచ్చిన పోజులు అభిమానుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి.

### బోల్డ్ అండ్ క్లాసీ లుక్..

ఈ ట్రెండీ లుక్ కోసం కృతి సనన్ నెక్ లైన్‌ను బోసిగా (ఎలాంటి నెక్లెస్ లేకుండా) ఉంచి, కేవలం పొడువాటి ఇయర్ రింగ్స్ మాత్రమే ధరించింది. జుట్టును ఫ్రీగా వదిలేసి తన లుక్‌ను మరింత హైలైట్ చేసుకుంది. క్లాస్ అండ్ మాస్ కాంబినేషన్‌లా ఉన్న ఈ కాన్సెప్ట్ కుర్రాళ్లకు పిచ్చెక్కిస్తోంది.

### తెర వెనుక అసలు సూత్రధారి..

కృతి సనన్‌ను ఇంత బ్యూటిఫుల్‌గా అలంకరించిన క్రెడిట్ ప్రముఖ స్టైలిస్ట్ సుకృతి గ్రోవర్ కే దక్కుతుంది. ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా పంచుకున్న ఈ ఫోటోలు షేర్ చేసిన కొద్ది నిమిషాల్లోనే లాక్స్ కొద్దీ లైకులు, కామెంట్లతో సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి.





### సెన్సెక్స్ 300 పాయింట్లు పతనం..

## నిఫ్టీ 23,400 వద్ద ముగింపు

- భారీ ఒడుదొడుకుల మధ్య నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు
- ఐటీ షేర్లలో భారీ అమ్మకాలతో పతనమైన సూచీలు
- పీఎస్‌యూ బ్యాంక్, ఫైనాన్షియల్ షేర్ల కొనుగోళ్లతో తగ్గిన నష్టాలు
- నిఫ్టీ 78 పాయింట్లు నష్టం
- రెండో రోజూ పతనమైన రూపాయి.. అమెరికా టారిఫ్‌ల ఆందోళన

**ముంబై:** బుధవారం నాడు భారత ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ఐటీ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడితో సూచీలు పతనమయ్యాయి. అయితే, ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌యూ), ఫైనాన్షియల్ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో ఇంట్రా-డే కనిష్ట స్థాయిల నుంచి మార్కెట్లు గణనీయంగా కోలుకున్నాయి. దీంతో నష్టాలు కొంతమేర తగ్గాయి.

ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 303.67 పాయింట్లు నష్టపోయి 74,346.17 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 77.95 పాయింట్లు తగ్గి 23,405.60 వద్ద ముగిసింది. సెషన్ మొత్తంలో మార్కెట్లలో తీవ్ర ఒడుదొడుకులు కనిపించాయి.

రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 5 శాతానికి పైగా పతనమై అత్యంత బలహీనంగా నిలిచింది. టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్ వంటి షేర్లు సెన్సెక్స్ పతనానికి ప్రధాన కారణమయ్యాయి. మరోవైపు, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ అత్యధికంగా లాభపడింది. నిఫ్టీ బ్యాంక్, ప్రైవేట్ బ్యాంక్, హెల్త్‌కేర్ సూచీలు కూడా మార్కెట్లకు మద్దతునిచ్చాయి. అపోలో హాస్పిటల్స్, టాటా మోటార్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లు లాభపడ్డాయి.

మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిఫ్టీకి 23,500 కీలక నిరోధక స్థాయిగా ఉంది. ఈ స్థాయిని దాటితే 23,800 వరకు రికవరీకి అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అలాగే, తక్షణ మద్దతు 23,300-23,350 వద్ద ఉందని తెలిపారు.

ఇదిలా ఉండగా, భారత రూపాయి విలువ వరుసగా రెండో సెషన్లోనూ పడిపోయింది. విదేశీ పెట్టుబడుల తరలిపోవడం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ ప్రతిపాదనలపై ఆందోళనలు రూపాయి పతనానికి కారణమయ్యాయి. టెక్నికల్‌గా స్పాట్ యూఎస్‌డీ-ఐఎన్‌ఆర్‌కు 96.50 వద్ద నిరోధం, 95.10 వద్ద మద్దతు ఉన్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు.

## కివీస్ గడ్డపై టీమిండియా మెగా టూర్..

### 40 రోజుల్లో 12 మ్యాచ్‌లు.. పూర్తి షెడ్యూల్ ఇదే

- ఈ ఏడాది చివర్లో న్యూజిలాండ్‌లో పర్యటించనున్న భారత క్రికెట్ జట్టు
- మొత్తం 12 మ్యాచ్‌లతో కూడిన అతిపెద్ద ద్వైపాక్షిక సిరీస్‌కు రంగం సిద్ధం
- 5 టీ20లు, 5 వన్డేలు, 2 టెస్టు మ్యాచ్‌లలో తలపడనున్న ఇరు జట్లు
- భారత్-కివీస్ క్రీడా సంబంధాలకు 100 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన
- అక్టోబర్ 22న ప్రారంభమై డిసెంబర్ 1న ముగియనున్న 40 రోజుల టూర్

**స్పోర్ట్స్ (ప్రజా ప్రతిభ):** భారత క్రికెట్ జట్టు ఈ ఏడాది చివర్లో న్యూజిలాండ్‌లో సుదీర్ఘ పర్యటనకు సిద్ధమైంది. ఇరు దేశాల మధ్య క్రీడా సంబంధాలు ప్రారంభమై 100 ఏళ్లు పూర్తయిన చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని ఈ మెగా సిరీస్‌ను నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ 1 వరకు 40 రోజుల పాటు సాగే ఈ పర్యటనలో ఇరు జట్లు మొత్తం 12 మ్యాచ్‌లలో తలపడనున్నాయి. ఇందులో 5 టీ20లు, 5 వన్డేలు, 2 టెస్టు మ్యాచ్‌లు ఉన్నాయి. న్యూజిలాండ్ గడ్డపై ఇప్పటివరకు ఏ దేశంతోనూ ఇంత పెద్ద ద్వైపాక్షిక సిరీస్ జరగకపోవడం ఈ పర్యటనకు ఉన్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది.

ఈ ప్రతిష్ఠాత్మక పర్యటన అక్టోబర్ 22న క్రైస్ట్‌చర్చ్ వేదికగా జరగనున్న తొలి టీ20 మ్యాచ్‌తో ప్రారంభమవుతుంది. మొత్తం ఐదు టీ20ల సిరీస్ నవంబర్ 1న ముగుస్తుంది. ఆ తర్వాత నవంబర్ 4న ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్‌లో తొలి వన్డే తో ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ మొదలవుతుంది. ఈ సిరీస్‌లోని చివరి రెండు వన్డేలకు మౌంట్ మాంగనూయ్ ఆతిథ్యం ఇవ్వనుంది.

ఈ పర్యటనలో అందరి దృష్టి టెస్టు సిరీస్‌పైనే కేంద్రీకృతమై ఉంది. రెండు మ్యాచ్‌ల ఈ టెస్ట్ సిరీస్‌లో భాగంగా తొలి టెస్టు నవంబర్ 19 నుంచి 23 వరకు వెల్లింగ్‌టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో జరుగుతుంది. ఇక రెండోది, పర్యటనలో చివరిది అయిన టెస్టు మ్యాచ్ నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు క్రైస్ట్‌చర్చ్‌లోని హ్యాగ్లీ ఓవల్ మైదానంలో జరగనుంది. ఈ మ్యాచ్‌తో టీమిండియా 40 రోజుల సుదీర్ఘ పర్యటన ముగుస్తుంది.

2019-20 తర్వాత భారత జట్టు న్యూజిలాండ్‌లో టెస్టు సిరీస్ ఆడటం ఇదే తొలిసారి. అయితే, ఈ మధ్య కాలంలో కివీస్ జట్టు రెండుసార్లు భారత్‌లో పర్యటించింది. ముఖ్యంగా 2024-25 పర్యటనలో భారత్‌ను సొంత గడ్డపైనే 3-0 తేడాతో ఓడించి టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి చరిత్ర సృష్టించింది. ఈ నేపథ్యంలో తాజా సిరీస్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇరు దేశాల మధ్య 100 ఏళ్ల క్రీడా బంధానికి గుర్తుగా న్యూజిలాండ్ ప్రభుత్వం ఈ పర్యటనకు ప్రత్యేక మద్దతు ఇస్తోంది.




### భారత్-న్యూజిలాండ్ సిరీస్ పూర్తి షెడ్యూల్:

#### టీ20 సిరీస్:

మొదటి టీ20: అక్టోబర్ 22, క్రైస్ట్‌చర్చ్
రెండో టీ20: అక్టోబర్ 24, క్రైస్ట్‌చర్చ్
మూడో టీ20: అక్టోబర్ 27, వెల్లింగ్‌టన్
నాలుగో టీ20: అక్టోబర్ 30, ఆక్లాండ్
ఐదో టీ20: నవంబర్ 1, హామిల్టన్

#### వన్డే సిరీస్:

మొదటి వన్డే: నవంబర్ 4, ఆక్లాండ్
రెండో వన్డే: నవంబర్ 7, వెల్లింగ్‌టన్
మూడో వన్డే: నవంబర్ 10, హామిల్టన్
నాలుగో వన్డే: నవంబర్ 13, మౌంట్ మాంగనూయ్
ఐదో వన్డే: నవంబర్ 15, మౌంట్ మాంగనూయ్

#### టెస్టు సిరీస్:

మొదటి టెస్టు: నవంబర్ 19-23, వెల్లింగ్‌టన్
రెండో టెస్టు: నవంబర్ 27-డిసెంబర్ 1, క్రైస్ట్‌చర్చ్

## ఒక్క భారత్-పాక్ మ్యాచ్‌కే కాదు.. టోర్నీ మొత్తానికి హైప్ తీసుకురండి: స్మృతి మంధాన

- ఒకే ఒక్క మ్యాచ్‌తో వరల్డ్ కప్‌ను చుట్టేయకండి
- అభిమానులకు, మీడియాకు టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన విజ్ఞప్తి
- జూన్ 14న బర్మింగ్‌హామ్‌లో చిరకాల ప్రత్యర్థుల సమరం

**స్పోర్ట్స్ (ప్రజా ప్రతిభ):** మహిళల టీ20 ప్రపంచకప్ 2026 సమరానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. జూన్ 14న బర్మింగ్‌హామ్ వేదికగా జరగబోయే దాయాదుల పోరు (భారత్ వర్సెస్ పాకిస్థాన్) కోసం క్రికెట్ ఫ్యాన్స్ వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. అయితే, ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌పై భారత జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. కేవలం భారత్-పాక్ మ్యాచ్‌కే పరిమితం కాకుండా, టోర్నీ మొత్తానికి విపరీతమైన ఆదరణ వచ్చేలా ప్రచారం కల్పించాలని మీడియాను, అభిమానులను ఆమె కోరింది.

### ఆ ఒక్క మ్యాచ్‌కే ప్రచారం అవసరం లేదు..!

టోర్నీ ప్రారంభానికి ముందు మంధాన మీడియాతో మాట్లాడుతూ.. "గతంలో బర్మింగ్‌హామ్‌లోనే జరిగిన 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్, పాక్ తలపడినప్పుడు టిక్కెట్లన్నీ హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. ఈసారి కూడా అదే క్రేజ్ ఉంది. అయితే, కేవలం ఒకే ఒక్క మ్యాచ్ గురించే మాట్లాడకుండా.. మనం ఈ టీ20 ప్రపంచ కప్‌నకు టోర్నీ మొత్తంగా మరింత ప్రచారం కల్పించాలని ఆశిస్తున్నాను. ఆ ఒక్క మ్యాచ్‌పై ఇప్పటికే కావాల్సినంత హైప్ ఉంది. అభిమానులు ప్రతి మ్యాచ్‌కు తమ మద్దతు అందిస్తారని ఆశిస్తున్నాం. వారి నమ్మకాన్ని నిలబెడుతూ మేము అత్యుత్తమ ప్రదర్శన ఇస్తాం."

### గ్రూప్-ఎ లో భారత్ సవాల్.. షెడ్యూల్ ఇదే!

ఈ మెగా టోర్నీలో గ్రూప్-ఎ లో ఉన్న భారత జట్టు లీగ్ దశలో గట్టి ప్రత్యర్థులను ఢీకొట్టబోతోంది. టీమిండియా మ్యాచ్‌ల షెడ్యూల్ పరిశీలిస్తే:

జూన్ 14 : పాకిస్థాన్ (తొలి మ్యాచ్)
జూన్ 17 : నెదర్లాండ్స్
జూన్ 21 :సౌతాఫ్రికా
జూన్ 25 : బంగ్లాదేశ్
జూన్ 28 : ఆస్ట్రేలియా



ఫామ్ అందుకోవాల్సిన సమయం..

భారత జట్టు ప్రస్తుత ఫామ్ విషయానికొస్తే.. ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో హర్మన్‌ప్రీత్ సేన మిశ్రమ ఫలితాలను చవిచూసింది. తొలి మ్యాచ్‌లో అద్భుత విజయాన్ని అందుకున్నప్పటికీ.. ఆ తర్వాత జరిగిన రెండు మ్యాచ్‌ల్లో వరుసగా ఓడిపోయి సిరీస్‌ను ఇంగ్లాండ్ చేతిలో చేజార్చుకుంది. ఈ నేపథ్యంలో లోపాలను సరిదిద్దుకుని, ప్రపంచకప్ వేటలో లీగ్ దశ నుంచే సత్తా చాటాలని టీమిండియా పట్టుదలగా ఉంది.

Printed published and own by him Dr. kongarapu Ganapathi, D.No 1/164 Balanki street, paalakonda-532440.
Officeaddress D-NO: 8-33-13, Near Kalabarathi opp com office, pithapuram colony, Maddilapalem visakhapatnam-530003. RNI:APTEL 2013/54721.
Editor in Chief: Danuri Srinivas - 9441500341